## నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక 29 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | జూలై 28, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

మంచి పనులుజేసి మరిచిపోవలయును,
మంచి చేయు వార్ని మరువబోకు
మరణమొందువరకు మదిన నీ సూక్తిని
మరువబోకుమయ్య మనిషిగాను

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.


# శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

- ఇది ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ్ ఇచ్చిన భరోసా
- చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయం



2లో

# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

## - మోడీ, అమిత్ షాల క్షమాపణలకు పట్టు

- ●గందరగోళం మధ్యే సభ ముందుకు పేపర్ లీకేజ్ సవరణ బిల్లు
- ●బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- ●బిల్లు ప్రాధాన్యం దృష్ట్యా చర్చకు అనుమతించిన స్పీకర్
- ●విపక్ష సభ్యుల ఆందోళనతో సభను



**న్యూఢిల్లీ,జూలై 27 :** పార్లమెంట్ ఉభయ సభల్లో గందరగోళం కొనసాగింది. విద్యార్థులపై కేసులు ఎత్తివేత మొదలు, లాఠీఛార్జికి నిరసనగా ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షాలు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో సభ్యులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. గందరగోళం మధ్యే ప్రభుత్వం పేపర్ లీకేజీల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. దీనిపై మాట్లాడేందుకు స్పీకర్ ఆహ్వానించినా వి పక్షాలు ముందుకు రాలేదు. నీట్–యూజీ




# కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

- బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేసిన ఎపి
- విచారణను సెప్టెంబర్‌కు వాయిదా వేసిన సుప్రీం

**న్యూఢిల్లీ,జూలై 27 :** కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమ వారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. మిగతా2లో...

# తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

- ఆగస్ట్ 1 నుంచి రాష్ట్రంలో అమలు
- డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెల్లడి



2లో

# ఆగస్ట్‌లో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

- కసరత్తు చేస్తున్న ప్రభుత్వం



2లో

# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకం ప్రారంభిస్తున్నాం- విద్యార్థుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం - అల్పాహార పథకాన్ని ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి



**ఖమ్మం,జూలై 27 :** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార పథకాన్ని ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏ విద్యార్థి కూడా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యకరమైన అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి పేర్కొన్నారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు

మిగతా2లో...

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

- పదేపదే కోర్టు ఉల్లంఘనలకు పాల్పడడంపై ఆగ్రహం
- ఇలాంటి వ్యక్తి అదే పోస్టులో కొనసాగడం సరికాదు
- లోతుకుంట భూముల వ్యవహారంపై హైకోర్టు విచారణ
- కోర్టులంటే గౌరవం ఉందంటూ క్షమాపణలు కోరిన రంగనాథ్



**హైదరాబాద్,జూలై 27 :** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులను ఆశ్రయించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని పేర్కొంది. ఉన్నతాధికారిగా ఉన్న రంగనాథ్.. కోర్టు ఉత్తర్వులను ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని ఆక్షేపించింది. మల్కాజిగిరి పరిధిలోని లోతుకుంట భూములకు సంబంధించి గతంలో ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను హైడ్రా ఉల్లంఘించిందంటూ శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నా.. ఫెన్సింగ్‌ను హైడ్రా సిబ్బంది తొలగించారని పేర్కొంది. ఒకే పిటిషన్‌కు సంబంధించి

మిగతా2లో...



# మాజీ ఎమ్మెల్యే పెద్దికి కెసిఆర్ పరామర్శ

- ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మాజీ సిఎం

**హైదరాబాద్,జూలై 27 :** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు ఎర్రవెల్లిలోని నివాసం నుండి బయలుదేరి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్ది కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారని తెలిసిందే.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

## కాంగ్రెస్ వచ్చినా మారని పరిస్థితి: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



**న్యూఢిల్లీ,జూలై 27 :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడటం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో

మిగతా2లో...

# ఆదర్శంగా మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్



**హైదరాబాద్,27 :** మహేశ్వరంలోని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు నిదునాక్ష్మికంగా సందర్శించారు. సోమవారం మోడల్ స్కూల్‌ను సందర్శించి పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు

మిగతా2లో...

# పార్లమెంటులో కొనసాగిన ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

సహా పలు పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలు, అక్రమాలపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమైన వేళ పరీక్షల భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ యాంటీ పేపర్ లీక్(సవరణ) బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని ప్రధానమంత్రి కార్యాలయ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సభ ముందుంచారు. ఈ సవరణల ద్వారా నిందితులకు కఠిన శిక్ష విధించడం సహా వేగవంతమైన దర్యాప్తు, నిర్దిష్ట కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా నిబంధనలను రూపొందించారు. ఇకపై ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి, రోజువారీ విచారణల తో కేసులను 90 రోజుల్లో పూర్తిచేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. కొత్త బిల్లులో దానిని గరిష్టంగా పదేళ్లకు పెంచారు. దీంతో పాటు ఇప్పటివరకు గరిష్టంగా రూ.10 లక్షలుగా ఉన్న జరిమానా.. నూతన చట్టంలో రూ.10 కోట్లకు పెరగనుంది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఇప్పటివరకు కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణ చేపట్టేవి. కానీ ఇకపై ఇలాంటి అక్రమాలపై స్పెషల్ టాస్క్ ఫోర్స్(ఎస్‌టీఎఫ్) ప్రత్యేక దర్యాప్తు చేపట్టనుంది. ఇప్పటివరకు దర్యాప్తు పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువు ఉండేది కాదు. కొత్త బిల్లు ప్రకారం.. రెండు నెలల్లోనే విచారణ పూర్తిచేయడం తప్పనిసరి కానుంది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు కానున్నాయి. రోజువారీ విచారణల్లో భాగంగా కేసులను మరింత వేగంగా పరిష్కరించనున్నారు. కొత్త బిల్లు ప్రకారం.. కేసు నమోదయ్యాక మూడు నెలల్లో తీర్పును వెలువరించాలి. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసుకునేందుకు 30 రోజుల గడువు నిర్ణయించారు. అప్పీల్‌పై కూడా 90 రోజుల్లోనే తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. పరీక్షల్లో పారదర్శకతను పెంచడం సహా ప్రశ్నపత్రాల లీకేజీలను పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పలుమార్లు చెప్పారు. నయా టెక్నాలజీ ద్వారా పరీక్షల భద్రతను మరింత పటిష్టం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం సహా సాంకేతిక సంస్కరణలు, దీర్ఘకాలిక నిర్మాణాత్మక మార్పులపై సిఫార్సులు చేసేందుకు నందన్ నీలేకణి ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసింది కేంద్రం. దీంతో పాటు కేంద్ర విద్యాశాఖ లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. నూతన విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రహ్లాద్ జోషి.. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను బలోపేతం చేస్తామని చెప్పారు.కాగా.. పరీక్షల అక్రమాలపై కేంద్రం ఇప్పటికే పాలనాపరమైన చర్యలు ప్రారంభించింది. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ)లో 47 మంది అధికారులను తొలగించినట్లు సమాచారం. అలాగే పరీక్షల నిర్వహణ విధానంలో మార్పులు, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలో సంస్కరణలు, సాంకేతిక భద్రతా చర్యలను సంగతి కట్టుదిట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జులై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది.

# శాంతియుత నిరసనలు తెలిపే హక్కు ఉంది

**న్యూఢిల్లీ,జులై 27 :** నీట్ పేపర్ లీక్ కేసుకు సంబంధించి విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కల్పిస్తుందని, కేవలం నిరసన వ్యక్తం చేస్తున్నారనే కారణంతో పోలీసు బలప్రయోగానికి పాల్పడకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జులై 20న 'సంసద్ చలో' కార్యక్రమంలో భాగంగా నీట్ పేపర్ లీక్ కేసుపై న్యాయం కోరుతూ విద్యార్థులు నిర్వహించిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘటనపై స్వతంత్ర విచారణ జరపాలని కోరుతూ పలువురు సుప్రీంను ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు రాజ్యాంగబద్ధ హక్కులపై కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పౌరులకు కల్పించిందని పేర్కొంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ అభిప్రాయాలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రతి పౌరుడికి ఉందని స్పష్టం చేసింది. అలాగే, కేవలం నిరసన జరుగుతోందనే కారణంతోనే లాఠీచార్జ్ లేదా బలప్రయోగాన్ని సమర్థించలేమని కోర్టు వ్యాఖ్యానించింది. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగంపై స్వతంత్ర విచారణ జరపాలని పిటిషనర్లు కోరారు. ఈ ఘటనలో పోలీసులు అనుసరించిన విధానంపై ప్రశ్నలు లేవనెత్తుతూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసనలు ప్రజల ప్రాథమిక హక్కుల్లో భాగమని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు నిరసనలు ఒక ప్రజాస్వామ్య మార్గమని, అలాంటి సందర్భాల్లో చట్టాన్ని అమలు చేసే సంస్థలు కూడా రాజ్యాంగబద్ధ హక్కులను గౌరవిస్తూ వ్యవహరించాలని అభిప్రాయపడుతున్నారు. సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు నిరసన హక్కు, పోలీసుల చర్యల పరిమితులపై మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.

# కృష్ణా జలాల్లో వాటాకు ఎపి డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున.. ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది.ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

# హైడ్రా కమిషనర్‌ను తొలగించండి

(మొదటి పేజీ తరువాయి)

పలుమార్లు కోర్టు ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ ధిక్కరించడం నేరమని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కోర్టుకు ఆయన హాజరుకావాలని ఆదేశించింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ జోక్యం చేసుకుని దీనిపై పూర్తిస్థాయిలో అఫిడవిట్ దాఖలు చేస్తామని తెలిపారు. అఫిడవిట్‌లో రంగనాథ్ క్షమాపణ కోరారు. కోర్టుల పట్ల పూర్తిస్థాయి నమ్మకముందని పేర్కొన్నారు. లోతుకుంట సర్వే నంబర్ 1, 2లో ఉన్న 40 ఎకరాల భూమిలోకి వెళ్లలేదని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు.. రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని, దీనికి కారణమేంటని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ఈ క్రమంలో రంగనాథ్‌ను తొలగించాలని పేర్కొంటూ.. ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశించింది. లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థాయిలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది. అర్హత కలిగిన అధికారిని హైడ్రా కమిషనర్‌గా నియమించాలని హైకోర్టు సూచించింది. 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. లోతుకుంట ప్రైవేటు భూములపై హైడ్రా జోక్యాన్ని తప్పుబట్టింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ కొనసాగితే రూల్ ఆఫ్ లా తప్పుతుందని పేర్కొంది. ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికారిని ఇంకా అదే పోస్టులో కొనసాగించడం సరికాదని.. రంగనాథ్‌ను తొలగించడం తప్ప మరో ఆప్షన్ లేదని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా రంగనాథ్ తన అఫిడవిట్‌లో తెలిపారు.

# తక్కువ ధరలకే నాణ్యమైన బియ్యం

**అమరావతి,జులై 27 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గుడ్ న్యూస్ చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించ నున్నట్లు తెలిపారు. ఏపీ పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరగనున్నట్లు పవన్ పేర్కొన్నారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52, పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందజేయడంతో సామాన్యులకు ఊరట లభించనుందని తెలిపారు. ఏపీ ప్రజలకు అండగా ఉండేందుకే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎంవో కార్యాలయం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. 'కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా ఏపీ పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తు న్నా. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యులకు సాంత్వన చేకూర్చే లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టడం హర్షణీ యం. ఆగస్టు 1 నుంచి ఏపీలోని 130 రైతుబజార్లు, 500 రైస్ మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో బియ్యం అందు బాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52కు, గ్రేడ్-1 పచ్చి బియ్యం కేజీ రూ.50కి అందించనున్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. సామాన్యులపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడాన్ని స్వాగతి స్తున్నా. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్షించి, మిల్లర్లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించాం. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనాపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని విశ్వసిస్తున్నా' అని పవన్ పేర్కొన్నారు.

# సింగరేణిని భ్రష్టు పట్టించిన కెసిఆర్

(మొదటి పేజీ తరువాయి)

విరుచుకుపడ్డారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వింత ప్రవర్తన, మొండి వైఖరి వల్లే సింగరేణి సంస్థ తీవ్రంగా నష్టపోయిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా బొగ్గు గనులను పారదర్శకంగా వేలం పాట ద్వారా కేటాయించాలని ఆదేశించినప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొనకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నూతన బొగ్గు బ్లాకులు లభించక, ఆదాయ మార్గాలు మూసుకుపోయి సింగరేణి వెనుకబడిపోవడానికి కేసీఆర్ ద్రోహమే కారణమని ఆయన ఆరోపించారు. సంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, గతంలో కేంద్రం ఇచ్చే రూ. 525 కోట్ల నిధులను సక్రమంగా వినియోగించుకోలేకపోయారని విమర్శించారు. 2015లోనే ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించినప్పటికీ, నాటి కేసీఆర్ ప్రభుత్వం ఒడిశా ముఖ్యమంత్రితో కనీసం మాట్లాడలేదని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, ఇటీవల ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాము చొరవ తీసుకుని నైని కోల్ బ్లాక్‌కు సంబంధించి అవసరమైన అన్ని అనుమతులను ఇప్పించినట్లు వెల్లడించారు. అలాగే తాడిచర్ల-2 బ్లాక్‌ను కూడా కేంద్రం సింగరేణికి కేటాయించిందని, మణుగూరులోని ఒక బ్లాక్‌ను వేలంలో ఉంచామని తెలిపారు.అయితే ఈ వేలంలో సింగరేణికి పోటీగా తెలంగాణ జెన్కో పాల్గొనడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. జెన్కో టెండర్ నుంచి తప్పుకుని, ఆ బ్లాకులు సింగరేణికి దక్కేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై సీఎంకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు కొత్త బ్లాకులు సింగరేణికి దక్కితే సుమారు 6,500 మందికి ఉద్యోగావకాశాలు రావడంతో పాటు, 830 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, దాదాపు రూ. 1.95 లక్షల కోట్ల టర్నోవర్‌తో సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ పరీక్షల చట్టం గురించి మాట్లాడుతూ.. 2024లోనే ఎలాంటి డిమాండ్లు, నిరసనలు లేకపోయినా ముందస్తు జాగ్రత్తగా ఈ యాంటీ-పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరైనా పేపర్ లీకేజీలకు పాల్పడాలంటే భయపడేలా, గుండెలాగిపోయే స్థాయిలో అత్యంత కఠినమైన నిబంధనలతో ఈ చట్టాన్ని రూపొందించామని చెప్పారు. విద్యా వ్యవస్థలో మార్పుల కోసం ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా స్వాగతిస్తుందని భావిస్తే, వారు చట్టాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. ఫలితాలు వచ్చిన వేళ నిరాశతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వారిలో ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చివరగా, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన దాడి ఘటన తీవ్ర బాధాకరమని, దీనిపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ

# ఆగస్టులో అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు

**హైదరాబాద్,జులై 27 :** రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. లేక పోతే ఆగస్టు 24 నుంచి జరిగవచ్చని అంటున్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెట్టామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలికి ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

# ఆదర్శంగా మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్

(మొదటి పేజీ తరువాయి)

కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొంటూ, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సాంకేతిక వనరులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, వసతి గృహాలు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.సమయాల్లో విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు సేవలను పాఠశాల వరకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటిన ప్రధాన కార్యదర్శి, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీ శశాంక్, శ్రీ కృష్ణ ఆదిత్య జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం విజయ్‌కు మద్రాస్ హైకోర్టు భారీ షాక్



**హైదరాబాద్,జులై 27:** సీఎం విజయ్‌కు మద్రాస్ హైకోర్టు భారీ షాక్ ఇచ్చింది. కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. ఈ నియామకాలు రాజ్యాంగంలోని 14, 16 అధికరణలకు (సమానత్వపు హక్కు, ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలు) విరుద్ధమని పేర్కొంటూ సోమవారం కీలక తీర్పు వెలువరించింది.గత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్ లో తమిళగ వెట్రి కళగం (టీవీకే) ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, తన కరూర్ పర్యటనలో బాధితుల కుటుంబాలకు చెందిన 31 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ అసిస్టెంట్ వంటి ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలను అందజేశారు.

# ఆకలితో ఏ విద్యార్థి ఉండకూడదు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. సహజ వనరులు ఎంత ముఖ్యమో, మానవ వనరులు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్న డిప్యూటీ సీఎం.. మానవ వనరుల అభివృద్ధిపై పెట్టుబడి పెడితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించడం చిన్న విషయం కాదని, ఇది దేశంలోనే కాక ప్రపంచ స్థాయిలో కూడా అరుదైన కార్యక్రమమని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని రాబోయే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విస్తరిస్తామని తెలిపారు. విద్యార్థులకు వారంలో మూడు రోజులు పాలు, మరో మూడు రోజులు రాగి జావ అందించేలా మెనూను రూపొందించామని వెల్లడించారు. పాలన అంటే అధికారం చెలాయించడం కాదని.. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించిన సమయంలో వారి కళ్లలో కనిపించిన ఆనందమే ప్రభుత్వ పనితీరుకు నిజమైన గుర్తింపు అన్నారు. అలాగే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద చికిత్స పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం సరైంది కాదని.. అలా మాట్లాడేవారు పూర్తి అవగాహన లేకుండా వ్యాఖ్యానిస్తున్నారని భట్టి విమర్శించారు. మధిర ప్రజలు తనను గెలిపించడంతోనే కాంగ్రెస్ పార్టీ తనకు డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించిందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. అల్పాహార పథకం కేవలం మధిర నియోజకవర్గానికే పరిమితం కాదని, తెలంగాణలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం చేశారు.

# డి.ఏ.పీ. ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్



**జగిత్యాల, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో రైతులకు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు డి.ఏ.పీ. ఎరువులు విక్రయిస్తున్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకురాలు డా. బోగ శ్రావణి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎమ్మార్పీ ధర రూ. 1,350 ఉన్నప్పటికీ, కొంతమంది డీలర్లు ఒక్కో బస్తాను రూ. 1,950కి విక్రయిస్తూ రైతుల నుండి అదనంగా రూ. 600 వసూలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. వ్యవసాయ సీజన్‌లో ఎరువులపై ఉన్న అత్యవసర అవసరాన్ని ఆసరాగా చేసుకుని కృత్రిమ కొరత సృష్టించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అందేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అక్రమ విక్రయాల్లో పాల్పడుతున్న డీలర్లపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బీజేపీ రైతుల పక్షాన నిలుస్తుందని డా. బోగ శ్రావణి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్దం తిరుపతి రెడ్డి, జిల్లా కార్యదర్శులు ముత్యం రెడ్డి, పాత రమేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, యువ మోర్చా అధ్యక్షుడు ఇట్టేడి రాజు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారపక అశోక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, జ్ఞానేశ్వర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహణ



**జగిత్యాల, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగిత్యాల రూరల్ మండలం పోలాస గ్రామ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించారు. ఎల్ నీనో ప్రభావంతో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల కోసం నాణ్యమైన విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ పాల్గొని రైతులకు విత్తనాలను అందజేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గజంగి నందయ్య, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, ఆత్మ కమిటీ చైర్మన్ కాటిపెళ్ళి గంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, హార్టికల్చర్ అధికారి లత, వ్యవసాయ శాస్త్రవేత్తలు, సర్పంచ్ మిల్కురి శంకరయ్య, తహసీల్దార్ హకీమ్, అదనపు వ్యవసాయ అధికారి తిరుపతి నాయక్, పాక్స్ చైర్మన్ మల్లారెడ్డి, మాజీ సర్పంచులు, జిల్లా సర్పంచుల ఫోరం ప్రతినిధులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా వర్షాభావ పరిస్థితుల్లోనూ లాభదాయకంగా వ్యవసాయం కొనసాగించవచ్చని అధికారులు సూచించారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి వేల్పుల పూజ



**హుస్నాబాద్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ రైతు వేదికలో వ్యవసాయ అధికారి వేల్పుల పూజ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించారు. ఎల్ నీనో ప్రభావంతో వర్షపాతం అనిశ్చితంగా ఉండటంతో రైతులు తక్కువ నీటి అవసరమున్న పప్పుధాన్యాలు, ఇతర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచి, ధృవీకరించిన విత్తనాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ విత్తన మేళా మూడు రోజులు కొనసాగనుంది. రైతులు తమకు కావలసిన విత్తనాలను రైతు వేదికలో కొనుగోలు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, టౌన్ అధ్యక్షుడు వివి రమణ, మండల అధ్యక్షుడు వెన్నరాజు, వార్డు కౌన్సిలర్లు, కిసాన్ జంగ్ అధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్ రెడ్డి, వ్యవసాయ అధికారులు, రైతులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలలో అన్న అక్క మెంటర్‌షిప్ కార్యక్రమం నిర్వహణ



**రామడుగు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామడుగు మండలం వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో అన్న అక్క మెంటర్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొని పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కోడింగ్, డేటా సైన్స్, డిజైన్ థింకింగ్, డిజిటల్ సిటిజెన్సీ వంటి అంశాలను బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామా దత్తు, ఉపాధ్యాయులు కరుణాకర్, గీతా, శ్రీలత, రవీందర్, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డా. అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం - పిడిశెట్టి రాజు



**హుస్నాబాద్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతరత్న, మాజీ రాష్ట్రపతి, ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాం 12వ వర్ధంతి సందర్భంగా హుస్నాబాద్ మండలంలో ప్రముఖ సామాజిక కార్యకర్త, ఎమ్మెల్సీ అభ్యర్థి పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పిడిశెట్టి రాజు మాట్లాడుతూ, కలాం తన జీవితాన్ని దేశ అభివృద్ధి, శాస్త్రసాంకేతిక రంగ ప్రగతికి అంకితం చేశారని, అగ్ని, పృథ్వి క్షిపణుల అభివృద్ధికి సారథ్యం వహించి "మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా గుర్తింపు పొందారని అన్నారు. పోఖ్రాన్--×× అణుపరీక్షల విజయానికి ఆయన చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. కలాం రచనలు యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తిని పెంపొందించాయని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల్లోని ప్రతిభను చిన్న వయస్సులోనే గుర్తించి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# బోర్నపల్లి బ్రిడ్జి పనులపై ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మీడియా సమావేశం



**జగిత్యాల, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జగిత్యాల మోతే రోడ్డులో పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బోర్నపల్లి జగన్నాథపూర్ బ్రిడ్జి నిర్మాణంపై జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజలకు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని అన్నారు. కేంద్ర మంత్రి జువెల్ ఓరం రాయికల్‌లో బ్రిడ్జి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని, ఎంపీ అరవింద్‌తో కలిసి ఢిల్లీలో వినతిపత్రం సమర్పించామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని, మంత్రి లక్ష్మణ్ కుమార్ తొలి సంతకం చేసి టెండర్ ప్రక్రియ ప్రారంభించారని తెలిపారు. కాంట్రాక్టర్లు పని చేయకపోవడంతో మళ్లీ టెండర్ ప్రక్రియ చేపట్టాలని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. 2012లో కోటి రూపాయలు మంజూరు అయినప్పటికీ పనులు పూర్తి కాలేదని, ఆ నిధులు ఏమయ్యాయో ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు. గతంలో రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్న జీవన్ రెడ్డి బోర్నపల్లి బ్రిడ్జి సహా పలు బ్రిడ్జిలను పూర్తి చేయలేదని విమర్శించారు. గత 25 ఏళ్లుగా టీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించిన జీవన్ రెడ్డి ఇప్పుడు రహస్య ఒప్పందంలో భాగంగా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని సంజయ్ కుమార్ ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ వాణి శ్రీనివాస్, ఆత్మ చైర్మన్ కాటిపెళ్ళి గంగారెడ్డి, ఎఎంసి చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశానికి అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కార్గిల్ విజయ్ దివస్ మరియు భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త కలాం వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ రక్షణలో సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని, యువత వారిని ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, క్రమశిక్షణ, సేవా భావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సరిహద్దుల్లో తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లోనూ జవాన్లు చేస్తున్న సేవలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ--కాశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడ్డాయని, దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, డా. కలాం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. పోఖ్రాన్ అణు పరీక్షలతో భారత్ తన శక్తిని ప్రపంచానికి చాటిందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత సైన్యం సాంకేతికంగా మరింత బలోపేతమైందని, వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమని మేయర్ స్పష్టం చేశారు. కార్యక్రమం అనంతరం అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. లయన్స్ క్లబ్ సభ్యులు, కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మి ప్రకాష్, కర్రె పద్మ అనిల్, గాజా రమా శివరాం, రిటైర్డ్ ఆర్మీ జవాన్లు పాల్గొన్నారు.

# రైతు సమస్యలపై కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా





**పెద్దపల్లి, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆరోపించారు. రైతుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీరు, విద్యుత్, ఎరువుల కొరత వంటి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెంటర్లలో రూ. 266.50కి లభించాల్సిన యూరియా బస్తాను ప్రైవేట్ దుకాణాల్లో రూ. 320కి, డిఏపీ బస్తాలను రూ. 1350కి బదులు రూ. 1750కి, ఎన్పీకే బస్తాలను రూ. 1400కి బదులు రూ. 2300కి విక్రయిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు కన్నెపల్లి మోటార్లను వెంటనే ప్రారంభించి సాగునీరు అందించాలని, విద్యుత్ కోతల వల్ల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అందించిన 24 గంటల ఉచిత విద్యుత్‌ను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న విక్రయించిన రైతులకు బర్దాన్ సంచుల డబ్బును వెంటనే ఖాతాల్లో జమ చేయాలని కోరారు. అనంతరం రైతుల ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. ఈ ధర్నాలో వంగళ తిరుపతిరెడ్డి, నూనేటి సంపత్, మోహన్ రావు, సందీప్ రావు, మార్కు లక్ష్మణ్, మల్లేశం, బైరం రామ్ రెడ్డి, రాజమల్లు, గణపతి, కొయ్యడ సతీష్ గౌడ్, సలేంద్ర రాములు, విన్నం రవీందర్, పెంచాల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, స్వామి విక్రమ్ గౌడ్, బాబురావు, శ్రీనివాస్, పడాల సతీష్ గౌడ్, సర్పంచులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# మత్తు రహిత యువతతోనే వికసిత్ భారత్ సాధ్యం

**- మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో నశా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్య, నైపుణ్యం, క్రమశిక్షణ, దేశభక్తితో ముందుకు సాగే యువతే వికసిత్ భారత నిర్మాణానికి బలమైన పునాది అవుతారని అన్నారు. యువత మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకుండా తమ లక్ష్యాల సాధనలో కృషి చేయాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. విద్యతో పాటు నైపుణ్యం, ఆరోగ్యకరమైన జీవన విధానం, సాంకేతిక పరిజ్ఞానం, దేశభక్తి వంటి విలువలను అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. స్కైరూట్ ఏరోస్పేస్ యువ ఇంజినీర్ల విజయాలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, లక్ష్యంపై నమ్మకం, కష్టపడి పనిచేసే తత్వం, దేశంపై ప్రేమ ఉంటే ఏ యువకుడైనా అసాధ్యాన్ని సాధ్యంగా మార్చగలడని అన్నారు. కార్యక్రమంలో డాన్స్, సంగీతం, నుక్కడ్ నాటక్, డిబేట్, పెయింటింగ్, రీల్ మేకింగ్, స్లోగన్ రైటింగ్, స్లామ్ పోయెట్రీ పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు గర్వకారణంగా, సమాజానికి ఆదర్శంగా, దేశ అభివృద్ధికి తోడ్పడే బాధ్యతాయుత పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించిన మేయర్, యువత అభివృద్ధి, నైపుణ్య వికాసానికి నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

# గోరక్షక చట్టాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి



**కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గోవును జాతీయ జంతువుగా గుర్తించి, గోరక్షక చట్టాలు అమలు చేయాలని కోరుతూ గోసమ్మాన్ ఆహ్వాన అభియాన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దేశవ్యాప్తంగా 6 కోట్ల సంతకాలు సేకరించిన ఈ కార్యక్రమంలో భాగంగా, కరీంనగర్ జిల్లా హిందూ సంఘ నాయకులు, గోభక్తులు 22 వేల సంతకాలను కలెక్టర్‌కు అందజేశారు. గో సంరక్షణ, గో సంపద పరిరక్షణ కోసం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ నాయకులు ఊట్కూరి రాధాకృష్ణ రెడ్డి, ఉప్పుల శ్యాంజి, విద్యాసాగర్, వంగల ఆంజనేయులు, రాగి సత్యనారాయణ, నరాల శంకర్ రాజేష్, రాజేశ్వరరావు, సుగుణాకర్ రెడ్డి, గాలి పెల్లి శంకరయ్య, మాటూరి వెంకటస్వామి, దయ్యాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహణ



**రామడుగు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రామడుగు మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. గ్రామంలో భద్రతా తనిఖీలు చేపట్టి ప్రజలకు సైబర్ నేరాలు, గంజాయి వినియోగం, రోడ్డు ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహన కల్పించారు. రూరల్ ఏసీపీ విజయకుమార్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని 50 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేసి జరిమానా విధించిన తర్వాత హెచ్చరించి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్, రామడుగు ఎస్సై రాజు, దాదాపు 100 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## జర్నలిస్టుల పిల్లలకు రాయితీ విద్య అందించాలని టీయూడబ్ల్యూజే వినతి



**పెద్దపల్లి, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు రాయితీ విద్యను కల్పించాలని టీయూడబ్ల్యూజే హెచ్--143 జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు అంకరి ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 500 మంది అక్రిడేటెడ్ జర్నలిస్టులు, 200 మంది నాన్ అక్రిడేటెడ్ జర్నలిస్టులు ఉన్నారని, వారి పిల్లలకు రాయితీ విద్యను అందించే అవకాశం కల్పించాలని కోరారు. గతంలో జర్నలిస్టుల ఇద్దరు పిల్లల్లో ఒకరికి ఉచితంగా, మరొకరికి 50% రాయితీ విద్యను ఇచ్చినట్లు గుర్తుచేస్తూ, ఈ ఏడాది ఇద్దరికీ ఉచిత విద్యను అందించే అవకాశాన్ని పరిశీలించాలని కోరారు. జర్నలిస్టుల విజ్ఞప్తిని కలెక్టర్ సానుకూలంగా స్వీకరించి, ప్రైవేటు పాఠశాలల్లో రాయితీ విద్యను అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 450 మంది జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అందజేసినట్లు, మిగిలిన వారికి కూడా త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు తిర్రి తిరుపతి గౌడ్, కత్తెర్ల తిరుపతి యాదవ్, అర్కుట మల్లేష్ యాదవ్, కొయ్యడ తిరుపతి యాదవ్, మేకల సంతోష్, చేగొండ రవి కుమార్ యాదవ్, మాచర్ల వంశీ, తిర్రి సుధాకర్ గౌడ్, సుంకె రాజు, మార్వాక అంజి, తూర్పాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికై కౌన్సిలర్ కార్యాలయం ప్రారంభం



**సుల్తానాబాద్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన కౌన్సిలర్ కార్యాలయాన్ని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ సోమవారం ప్రారంభించారు. 14వ వార్డు కౌన్సిలర్ వేగోళం పద్మ--అబ్బయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొని నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు వేదికలో విత్తన మేళా



**సుల్తానాబాద్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైతు వేదికలో సోమవారం విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్‌వీకే జిల్లా కోఆర్డినేటర్ ఓదెల సంపత్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి పైడితల్లి మాట్లాడుతూ కంది, నువ్వులు, మొక్కజొన్న పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, విత్తన--ఎరువుల డీలర్లు, సహకార సంఘాల సీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## నూతన సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతల స్వీకరించిన శ్రీరామ్



**సుల్తానాబాద్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ నూతన సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీరామ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఆరవ వార్డు కౌన్సిలర్ భాకం సాయికిరణ్ కార్యాలయానికి వెళ్లి నూతన అధికారిని మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీరామ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతమైన సేవలు అందిస్తూ కార్యాలయం మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, కొత్త బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని అభినందనలు తెలిపారు.

## చెక్ డ్యామ్ కూల్చివేతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చెక్ డ్యామ్‌ను కూల్చివేసి ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న భూ కబ్జాదారులపై, అలాగే రెవెన్యూ--ఇరిగేషన్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి సంపత్ డిమాండ్ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఆయన మాట్లాడుతూ, మానకొండూరు మండలం పెద్దూరుపల్లి గ్రామ శివారులో చెక్ డ్యామ్ కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని తప్పుడు ధృవపత్రాలతో ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై అక్రమంగా పట్టాలు ఇచ్చారని విమర్శించారు. స్థానికంగా అధికారులు స్పందించకపోవడం అవినీతి నిదర్శనమని పేర్కొంటూ, తక్షణమే తప్పుడు పట్టాలను రద్దు చేసి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బుర్ర రత్నాకర్ పాల్గొన్నారు.

## ఎస్సీ, బీసీ విద్యార్థులకు అదనపు హాస్టళ్లు కేటాయించాలని డివైఎఫ్ఐ డిమాండ్



**కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, బీసీ విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనంగా ప్రభుత్వ కళాశాల హాస్టళ్లు కేటాయించాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ వినతిపత్రం ద్వారా కలెక్టర్ చిత్ర మిశ్రాకు విజ్ఞప్తి చేసింది. డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ పటేల్ మాట్లాడుతూ, ప్రస్తుత హాస్టళ్లు సరిపోక విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో అధిక ఖర్చులు భరించలేక చదువులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా కొత్త హాస్టళ్లు ఏర్పాటు చేసి, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అదేవిధంగా ప్రతి ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్‌లో ఏఎన్ఎంలను నియమించి విద్యార్థుల ఆరోగ్య భద్రతను కాపాడాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, లైబ్రరీ, స్టడీ రూమ్‌లు, భద్రత వంటి సదుపాయాలను కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్, జిల్లా కోశాధికారి అరవింద్, నాయకులు శ్రీహరి, రమేష్ పాల్గొన్నారు.

## తీగలగుట్టపల్లి ఆర్ఓబి పనులు వేగవంతం చేయాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్--చొప్పదండి ప్రధాన రహదారిపై తీగలగుట్టపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, బ్రిడ్జి నిర్మాణం, సర్వీస్ రోడ్లు, భూసేకరణ, డ్రైనేజీ వంటి అనుబంధ పనుల పురోగతిని సమీక్షించారు. పనుల్లో జాప్యం జరగకుండా ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని, నాణ్యతలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, నిర్మాణ ప్రాంతంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సర్వీస్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఆర్ఓబి పూర్తయితే రైల్వే గేటు వద్ద నిరీక్షణ సమస్యలు తొలగి, రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ కుమారస్వామి, డీఈ కిరణ్, ఏఈ మధు తదితర అధికారులు పాల్గొన్నారు.

## నీలగిరి ఎక్స్‌ప్రెస్ కథనానికి స్పందన

**– విద్యార్థుల భద్రతకు శ్రీ సరస్వతి శిశు మందిర్ పెద్దపీట**

**– ఒమేగా హాస్పిటల్ చౌరస్తాలో 'గో స్లో--స్కూల్ జోన్' బారికేడ్లు ఏర్పాటు**



**కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థుల భద్రతపై నీలగిరి ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన కథనానికి శ్రీ సరస్వతి శిశు మందిర్ హైస్కూల్ యాజమాన్యం స్పందించింది. జూలై 8న ప్రచురితమైన "ప్రమాదాలకు నిలయంగా మారిన ఒమేగా హాస్పిటల్ చౌరస్తా" కథనం నేపథ్యంలో పాఠశాల పరిసరాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది. విద్యార్థులు పాఠశాలకు వచ్చి వెళ్లే సమయంలో రహదారి దాటడం సురక్షితంగా ఉండేలా స్కూల్ పరిసర రహదారికి ఇరువైపులా "గో స్లో--స్కూల్ జోన్" హెచ్చరికలతో భారీ బారికేడ్లను ఏర్పాటు చేసింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు వేగాన్ని తగ్గించే అవకాశం ఉండటంతో పాటు, విద్యార్థులు రహదారి దాటే సమయంలో ప్రమాదాల ముప్పు తగ్గుతుందని స్థానికులు పేర్కొన్నారు.

యాజమాన్యంపై అభినందనలు

విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల యాజమాన్యం స్వచ్ఛందంగా ముందుకొచ్చి బారికేడ్లు ఏర్పాటు చేయడంపై తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల సమీపంలో వేగ నియంత్రణ, హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా ఉండాలని వారు కోరుతున్నారు. సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, వాటి పరిష్కారానికి దారితీసేలా కథనాలు ప్రచురించడం ద్వారా నీలగిరి ఎక్స్‌ప్రెస్ తన సామాజిక బాధ్యతను కొనసాగించాలని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## మురికి కాలువలు, నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించిన సింధుజ ప్రకాష్ గౌడ్



**ఖానాపూర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మున్సిపల్ పరిధిలోని పదో వార్డులో కౌన్సిలర్ సింధుజ ప్రకాష్ గౌడ్ సోమవారం ప్రధాన రోడ్లు, మురికి కాలువలు, నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించారు. నీరు నిలువుండే ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో వార్డు అధికారి నీరజ్ పట్వారి, ప్లానింగ్ అధికారి మనీష్ రాహుల్, మున్సిపల్ ద సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

## తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలి ఏడీఏ సుజాత



**ఖానాపూర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా లేకపోవడంతో తక్కువ నీటితో పండే పంటలను ఎంచుకోవాలని ఖానాపూర్ ఏడీఏ సుజాత రైతులకు సూచించారు. సత్తెనపల్లి రైతు వేదికలో సోమవారం విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఎరువుల దుకాణాల యజమానులు, వ్యవసాయ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా వర్షాభావ పరిస్థితుల్లోనూ లాభదాయకంగా వ్యవసాయం కొనసాగించవచ్చని అధికారులు తెలిపారు..

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రూరల్ మండలంలో రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన రైతు ఆవుల అంజయ్య (56) పల్సర్ మోటార్‌సైకిల్‌పై కరీంనగర్ వైపు వస్తూ, రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోయాడు. సమాచారం అందుకున్న వెంటనే రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని, గాయపడిన అంజయ్యను 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి భద్రపరచగా, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రవాస్‌లో పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం



**హుస్నాబాద్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలంలో ఎస్ఐఆర్ ప్రవాస్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మండల సంయోజకుడిగా హాజరై, మండల పదాధికారులతో సమావేశమయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొని బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. మండలంలోని పలు గ్రామాల బూత్ కమిటీల పనితీరును సమీక్షించి బాధ్యతలను ఖరారు చేశారు. ఇటీవల ఎన్నికైన మండల పదాధికారులను ఘనంగా సన్మానించి, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ అధ్యక్షత వహించగా, మండల పదాధికారులు, మోర్చా అధ్యక్షులు, శక్తికేంద్ర ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ పాఠశాలలో కిచెన్ షెడ్ ప్రారంభించిన ఎంపీడీవో రాము



**గంగాధర, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన కిచెన్ షెడ్‌ను మండల అభివృద్ధి అధికారి రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు అదనపు గదులు, టాయిలెట్లు అవసరమని, వాటి నిర్మాణం కోసం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. పదవ తరగతి విద్యార్థులను ఉద్దేశించి కేవలం చదువుపైనే దృష్టి పెట్టి మంచి మార్కులు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దూలం కళ్యాణ్, ప్రధానోపాధ్యాయుడు డా. ఎలిగేటి మల్లికార్జున, గ్రామ కార్యదర్శి మమత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాగునీటి పైపులైన్ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగర ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలను కల్పించే దిశగా నగరపాలక సంస్థ మరో కీలక అడుగు వేసింది. 19వ డివిజన్ రేకుర్తి ప్రాంతంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్ పనులకు శాసనసభ్యుడు గంగుల కమలాకర్‌తో కలిసి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, పైపులైన్లు, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధిలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ సుదగోని మాధవి కృష్ణ, కార్పొరేటర్లు పర్వతం మల్లేశం, గుగ్గిళ్ల జయశ్రీ, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్లపై పశువుల సమస్యతో వాహన చోదకులకు ఇబ్బందులు



ఖానాపూర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ పట్టణంలో రహదారులు పూర్తిగా వెడల్పు చేయకపోవడంతో పాటు రోడ్లపై పశువులు తిరగడం వాహన చోదకులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ప్రతిరోజూ నిర్మల్, మంచిర్యాల్, జగిత్యాల, మెట్పల్లి ప్రాంతాలకు వందలాది వాహనాలు, ఆర్టీసీ బస్సులు ప్రయాణిస్తుం డటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువులను యజమానులు విచ్చలవిడిగా వదలడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. గతంలో పశువులు వాహనాల ఢీకొనడం వల్ల గాయపడిన సంఘటనలు, మరణాలు కూడా చోటుచేసుకున్నాయి. మున్సిపల్ అధికారులు పశువులను గోశాలకు తరలించినా, హెచ్చరికలు చేసినా పరిస్థితి మారలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు పశువుల యజమానులను గుర్తించి చర్యలు తీసుకుంటే ప్రమాదాలు నివారమవుతాయని స్థానికులు కోరుతున్నారు.

## వీధి దీపాల సమస్యను పరిష్కారించిన కౌన్సిలర్



ఖానాపూర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఖానాపూర్ మున్సిపల్ పరిధిలోని ఏడో వాడులోని పద్మావతి నగర్‌లో గత కొన్ని రోజులుగా నిలిచిపోయిన విద్యుత్ దీపాల సమస్యను కౌన్సిలర్ మిమ్మల్ని రమేష్ పరిష్కరించారు. సిబ్బందితో కలిసి వీధి దీపాలను అమర్చడంతో కాలనీలో చీకట్లు తొలగి వెలుగులు రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు



పెద్దపల్లి, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఒ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు హాజరయ్యారు. మొదటగా భారతరత్న, మాజీ రాష్ట్రపతి డా. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సమావేశంలో 39 ఎజెండా అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. తరువాత ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్ష నిర్వహించి, పట్టణంలోని 36 వార్డులలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా అమలు చేయాలని సూచించారు. అవసరమైతే వార్డులలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ ముస్కాన్ నాజ్ నయ్యర్ అలీ, కౌన్సిలర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ అధ్యాపకుడి మృతి పై సంతాప సభ నిర్వహణ



కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కాకతీయ విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుడు డాక్టర్ ఓ. రవీందర్ గుండెపోటుతో హఠాత్తుగా మృతి చెందడంతో ఆయన స్మారకార్థం శాతవాహన విశ్వవిద్యాలయ కామర్స్ కళాశాలలో సంతాప సభ నిర్వహించారు. కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మనోజ్ కుమార్, జనరల్ కార్యదర్శి డాక్టర్ రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవీందర్ సేవలను స్మరించుకున్నారు. ఆయన మృతి విద్యా రంగానికి తీరని లోటు అని పేర్కొంటూ, రెండు నిమిషాల మౌనం పాటించి ఆత్మశాంతి కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే. రాజు, డాక్టర్ బి. నరేష్, డాక్టర్ బి. పరుశరాం, డాక్టర్ అజయ్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ జోసెఫ్ రాజు, డాక్టర్ ప్రసాద్‌తో పాటు ఇతర కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షా పత్రాల లీకేజీ ఘటనపై కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తీవ్ర విమర్శలు




కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నీట్ పరీక్షా పత్రాల లీకేజీ ఘటనపై నిరసన తెలిపిన యువతపై పోలీసులు బాష్పవాయువు, లాఠీచార్జ్, పెల్లెట్ గన్స్‌తో దాడి చేయడం దుర్మార్గమని మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మౌనం వీడి యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని, గాయపడిన వారికి న్యాయం చేయాలని కోరారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల రద్దులతో నిరుద్యోగ యువత నష్టపోయిందని, కాగా కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా పోటీ పరీక్షలు నిర్వహించి 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించినట్లుగా యువతకు 21 ఏళ్లకే చట్టసభల్లో పోటీ చేసే అవకాశం కల్పించేలా చట్టం తీసుకురావాలని, యువశక్తికి ప్రాధాన్యం ఇచ్చే సంస్కరణలను కేంద్రం అమలు చేయాలని కోరారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా దేశ యువతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తాజొద్దీన్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జీడీ రమేష్, ఎల్లారెడ్డి, మిర్యాల శ్రీధర్ రెడ్డి, షబానా, మహమ్మద్ షెహన్షా, సాయిరాం, ముల్కల యోనా, మాసుం ఖాన్, జిలుకర రమేష్, బత్తుల రాజ్ కుమార్, ఇమామ్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన పోలీసు సేవలే లక్ష్యం

**- ఎస్‌హెచ్‌వో ఎస్. వెంకటేశ్వర్లు**

**- అమన్‌గల్ ఎస్ఐగా సంతోష్ కుమార్ రెడ్డి బాధ్యతల స్వీకరణ**



ఆమనగల్లు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించడమే ప్రతి పోలీసు అధికారి ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని అమన్‌గల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన సబ్‌ఇన స్పెక్టర్ ఎ. సంతోష్ కుమార్ రెడ్డి సోమవారం అమన్‌గల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో ఎస్. వెంకటేశ్వర్లుకు రిపోర్ట్ చేసి విధుల్లో చేరారు. గతంలో చేవెళ్ల, శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్లలో సమర్థవంతంగా సేవలందించిన సంతోష్ కుమార్ రెడ్డికి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వర్లు మాటా ్లడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబ ాటులో ఉంటూ చట్ట పరిరక్షణ, శాంతి భద్రతల నిర్వహణ, ప్రజా సమస్యలపై సత్వర స్పందనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్నేహపూర్వక పోలీసింగ్‌తో పాటు పెండింగ్ కేసుల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆకాంక్షించారు. నూతన ఎస్ఐ చేరికతో అమన్‌గల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు సేవలు మరింత సమర్థవంతంగా ప్రజలకు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# జైపాల్ రెడ్డి 7వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- కాంగ్రెస్ శ్రేణులకు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అవ్వారి శివలింగం పిలుపు**



ఆమనగల్లు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మాజీ కేంద్ర మంత్రి, దివంగత సూదిని జైపాల్ రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా మంగళవారం (జూలై 28) ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నివాళి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం పిలుపునిచ్చారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అమన్‌గల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రజాప్రతినిధులు, ఆమనగల్లు మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జైపాల్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించాలని కోరారు. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ప్రజా జీవితంలో విశిష్ట సేవలందించిన జైపాల్ రెడ్డి ఆశయాలను స్మరించుకోవడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులందరూ తప్పనిసరిగా పాల్గొని నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు.

## బాధిత కుటుంబానికి అండగా పాపిశెట్టి రాము

**- గుద్దేటి లక్ష్మమ్మకు ఘన నివాళి.. కుటుంబ సభ్యులకు పరామర్శ, ఆర్థిక సాయం**



ఆమనగల్లు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తలకొండపల్లి మండలం ఎదెల్లి గ్రామానికి చెందిన గుద్దేటి లక్ష్మమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని మెకానిక్ పర్వతాలు ద్వారా తెలుసుకున్న ప్రముఖ సంఘ సేవకుడు, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము ఎదెల్లి గ్రామానికి చేరుకుని లక్ష్మమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. లక్ష్మమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం మృతురాలి కుమారుడు వెంకటయ్యకు తన వంతు ఆర్థిక సహాయం అందజేసి కుటుంబానికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో రామన్నతో పాటు రామన్న మిత్ర మండలి సభ్యులు భాస్కర్, పర్వతాలు, జంగయ్య, రాములు, కనకయ్య, యాదయ్య తదితరులు పాల్గొని గుద్దేటి లక్ష్మమ్మకు శ్రద్ధాంజలి ఘటించారు.

# తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు

**- కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు**



ఆమనగల్లు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాల యాన్ని సోమవారం డీసీసీ ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మొక్కులు చెల్లించుకుని ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతి, సామరస్యం నెలకొని ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు పేర్కొన్నారు. దర్శనం అనంతరం దేవస్థానం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం



నందికొట్కూరు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నందికొట్కూరు మండలంలోని జంగంపాడు మరియు శాతనికోట గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి ఇంటింటికీ తిరిగి, గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరిం చారు. గ్రామస్థులు ఆసక్తిగా వినిపిస్తూ, పథకాల ప్రయోజనాలను తెలుస ుకున్నార . ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, నాయకులు హనుమంతు నాయక్, నాగరాజు, సాంబబాబా, నారాయణ, రామకృష్ణ, రాజశేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఓబీసీ మహాసభ విజయవంతం చేయాలని పిలుపు



పెద్దపల్లి, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కర్ణాటకలోని బెంగళూరులో జ్ఞాన జ్యోతి ఆడిటోరియంలో జరగనున్న 11వ జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జనగణలో బీసీ కులగణ చేపట్టాలని, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఉత్పత్తి కులాలు రాజ్యాధికార దిశగా పోరాటం చేయాలని, ఆర్థిక, సామాజిక, రాజకీయ సమానత్వం సాధించడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ మహిళా కన్వీనర్ సిరవేణి స్వప్న, రాష్ట్ర కార్యదర్శి కన్నా రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలువ రమేష్, ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి లక్ష్మణ్, యువజన అధ్యక్షుడు శ్రీధర్, సర్పంచులు, బిజెపి సీనియర్ నాయకులు బుర్ల లక్ష్మీనారాయణ, మీడియా ప్రతినిధి అబ్దుల్ మల్లిక్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల సత్వరమే పరిష్కరించాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 250 మంది అర్జీదారులు దరఖాస్తులు సమర్పించగా, కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు బదిలీ చేసి, పెండింగ్‌లో ఉన్నవాటిని త్వరగా క్లియర్ చేయాలని సూచించారు. ఈ కార్య క్రమ ంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాసరెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు



ఖానాపూర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10న జరగనున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. సోమవారం ఖానాపూర్ మండల కేంద్రంలో కరపత్రాలు విడుదల చేసిన సంఘం నాయకులు ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, రోజువారీ వేతనం రూ.800 చెల్లించాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, “వి బి జి రాంజీ” చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలని కుట్రలు చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టేందుకు ఆగస్టు 10న కలెక్టర్ కార్యాలయం వద్ద జరగనున్న జైల్ భరో కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు, రైతులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దాకూర్ తిరుపతి, మండల అధ్యక్షుడు పానగంటి నరేష్ కుమార్, కార్యదర్శి సుంచుల నారాయణ, ఉపాధ్యక్షుడు నాగుల నర్సాగౌడ్, పట్టణ అధ్యక్షుడు చింతలపల్లి శంకర్, కార్యదర్శి ఎం.డి. రియాసత్, షేక్ గఫర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉర్దూ వర్క్‌షాప్



కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): శాతవాహన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో “విద్యా సాధికారత 100 రోజుల చొరవ”లో భాగంగా, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) ఉర్దూ విభాగం, విశ్వవిద్యాలయం ఉర్దూ విభాగంతో కలిసి రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిం( చింది. డిజిటల్ ఉర్దూ సాధనాలు, కంప్యూటర్ ఆధారిత అనువాదం, ఉర్దూ కాలిగ్రఫీ, ఆధునిక ఉర్దూ ఇమ్లా” అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులు, అధ్యాపకులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పరిచయం చేశారు. మొదటి రోజు మానూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అబ్దుల్ సమీ సిద్ధిఖీ డిజిటల్ ఉర్దూ టూల్స్‌పై, డాక్టర్ కలీమ్ మొహియుద్దీన్ అనువాద పద్ధతులపై సెషన్లు నిర్వహించారు. రెండవ రోజు ఎన్సిపియు ఎల్‌కు చెందిన అబ్దుల్ గఫార్ ఉర్దూ కాలిగ్రఫీపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. ప్రొఫెసర్ మహమ్మద్ జాఫర్ జారీ ఆధునిక ఉర్దూ స్పెల్లింగ్, ఉచ్చారణపై ప్రసంగించారు. ప్రారంభోత్సవానికి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అఫ్సారీ ఉస్మానీ, పరీక్షల కంట్రోలర్ డాక్టర్ సురేష్ కుమార్, ప్రొఫెసర్ అబ్రార్ బాఖీ, డాక్టర్ మస్రూర్ సుల్తానా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ధృవపత్రాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఆధునిక భాషా, సాంకేతిక నైపుణ్యాలను అందించడంలో ఈ వర్క్‌షాప్ కీలకంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి ఏసీఓబి సంపత్ కుమార్




కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో త్రీ టౌన్ పోలీసులు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. డ్రగ్స్‌కు నో చెప్పి, జీవితానికి యెస్ చెప్పాలి అని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రూపొందించిన ఫ్లాకార్డ్స్ ద్వారా మాదకద్రవ్యాలకు నో చెప్పండి -- జీవితానికి యెస్ చెప్పండి, డ్రగ్స్ మన జీవితాలకు శత్రువులు, ఆరోగ్యకరమైన యువతే దేశ భవిష్యత్తు వంటి నినాదాలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏసీఓబి సంపత్ కుమార్, ఏవోబి శ్రవణ్ కుమార్, ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బైరం మహేష్, ఎన్. శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖలో ఆధునిక సాంకేతిక శిక్షణ ప్రారంభం



**కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పోలీసు శాఖలో కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా విశ్లేషణ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో సీపీ గౌష్ ఆలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పోలీసు శాఖ కూడా అదే స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ ఆధారిత పోలీసింగ్, స్మార్ట్ సర్వైలెన్స్, సైబర్ నేరాల నివారణలో ఈ శిక్షణ కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2018, 2020, 2024 బ్యాచ్‌ల కానిస్టేబుళ్లకు 11 దశల్లో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి దశలో 80 మంది కానిస్టేబుళ్లు పాల్గొని ఐదు రోజుల పాటు శిక్షణ పొందనున్నారు. ఈ కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపల్ అడిషనల్ ఎస్పీ ఎం. పిచ్చయ్య, వైస్ ప్రిన్సిపల్ ఏసీపీ గంగాధర్, ఏసీపీలు విజయపాల్ రెడ్డి, బి.
నారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమం వేగవంతం చేయాలి

**– ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు**



**సుల్తానాబాద్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న 'ఎస్ఐఆర్' కార్యక్రమంపై ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు సమీక్ష నిర్వహించారు. జూలై 28 నుంచి ఆగస్టు 1 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఇంటింటి ఓటర్ మ్యాపింగ్‌ను పూర్తిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 80 శాతం మ్యాపింగ్ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను త్వరగా ముగించాలని సూచించారు. అధికారులు, బీఎల్‌ఓలు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. సమావేశానికి ముందు మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ పుష్పలత, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో, కౌన్సిలర్లు, బీఎల్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సి.ఎస్ సంజయ్ జాజును మర్యాదపూర్వకంగా కలిసిన ఆచార్య ఉమేశ్ కుమార్



**కరీంనగర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును కలిశారు. సి.ఎస్. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు పచ్చటి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న విద్యా, పరిశోధనా కార్యక్రమాలు, మౌలిక వసతుల అవసరాలను వివరించి, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సి.ఎస్. సంజయ్ జాజు, శాతవాహన విశ్వవిద్యాలయ అభివృద్ధికి, విద్యార్థుల పురోగతికి ప్రభుత్వం తరపున తగిన మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు.

## కొండమల్లేపల్లి పాఠశాలలో సమస్యలు వెంటనే పరిష్కరించాలి ఎస్ఎఫ్ఐ డిమాండ్



**దేవరకొండ, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ, విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యా, మౌలిక వసతుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించామని తెలిపారు. సర్వేలో తరగతి గదుల కొరత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, ఫర్నిచర్ కొరత, ఉపాధ్యాయుల సమస్యలు వంటి అంశాలను గుర్తించారు. ఈ సమస్యలపై సమగ్ర నివేదికను సిద్ధం చేసి, దేవరకొండ ఆర్డీవో పద్మప్రియకు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. "ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి" అని ఎస్ఎఫ్ఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మండల అధ్యక్షుడు రామావత్ రాజేష్, నాగరాజు, ఏ. సుధాకర్, అంకురి ప్రణయ్, దుర్ల కార్తీక్, నీతిన్, బత్తుల శివ, నేతళ్ళ జైరాం తదితరులు పాల్గొన్నారు.

## ఎలిగేడు పాఠశాలలో ఇన్-సర్వీస్ శిక్షణ పరిశీలన



**ఎలిగేడు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మూడు రోజులపాటు జరుగుతున్న తెలుగు ఇంటిగ్రేటెడ్ ఇన్-సర్వీస్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పీ.ఎం. షేక్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, "తెలుగు భోధనలో వినూత్న పద్ధతులను అవలంబించి విద్యార్థుల్లో భాషా నైపుణ్యాల అభివృద్ధికి కృషి చేయాలి" అని సూచించారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులతో పరస్పర చర్చ నిర్వహించి, వారి సందేహాలకు సమాధానాలు అందించారు. భోధనా ప్రక్రియను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దేందుకు విలువైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇంచార్జి, కాంప్లెక్స్ హెచ్ఎం గండ్ర దేవేందర్ రావు, డీఆర్పీలు జ్యోతి, మహేశ్వర్, వెంకటలక్ష్మీ, శ్రీనివాసులుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన దాతుర్క లక్ష్మీరాజం



**ఖానాపూర్, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు, ఖానాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగిలి శంకర్ ఆధ్వర్యంలో గోడల పంపు గ్రామ కాంగ్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా దాతుర్క లక్ష్మీరాజం, ఉపాధ్యక్షులుగా మాటేరి రాజ్‌కుమార్, దూడ శంకర్, ప్రధాన కార్యదర్శిగా అమంద రమణ రాజ్, యువజన అధ్యక్షుడిగా మోలంకాల ఆనంద్, కోశాధికారిగా అమంద సుదర్శన్, కార్యదర్శులుగా సింగం రాజారాం, మాస వేణి మల్లేష్, తుదిగేని శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా కట్ల పోషన్న ఎన్నికయ్యారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా కట్ల నాగేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చిలుముల నరసయ్య, కిషన్ సెల్ అధ్యక్షుడిగా మాస వేణి సాయిగౌడ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పాదం రాజేశ్వర్, మామడ రాజలింగు, బెజ్జారపు కాంతయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జంగిలి శంకర్ మాట్లాడుతూ, గ్రామస్థాయిలో పార్టీని పటిష్టం చేసి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, ఆ విశ్వాసాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి అంకం రాజేందర్, పిఎసిఎస్ చైర్మన్ అమంద శ్రీనివాస్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజు నాయక్, సర్పంచులు, మాజీ సర్పంచులు, ఏఎంసి డైరెక్టర్ గంగాధర్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుతో లాభం పొందాలి

**– కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతున్నందున వరి సాగు మినహా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లాభం పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ రైతులకు సూచించారు. సోమవారం భీమారం మండలంలోని రైతు వేదికను సందర్శించిన కలెక్టర్ మాట్లాడుతూ నీటి లభ్యతలో లోటు కారణంగా వరి సాగులో నష్టం వాటిల్లే అవకాశం ఉందని, పప్పుధాన్యాలు, పత్తి, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి తక్కువ నీటి అవసరం గల పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులకు రాయితీ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని, భూసార పరీక్షలు చేసి కార్డులు అందించాలని, యూరియా సరఫరా పంట సాగుకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, మందులు, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా ఉండాలని సూచించారు. బెల్లంపల్లి మండల గురజాల గ్రామంలో రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, రైతులు తక్కువ నీటి అవసరం గల పంటలను ఎంచుకోవాలని, రాయితీ విత్తనాలు, ఎరువులు పొందాలని సూచించారు. తహసిల్దార్ కార్యాలయంలో సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను పరిశీలించి, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో
సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మార్వో కార్యాలయం ఎదుట రైతుల ఆమరణ నిరాహార దీక్ష

**– సర్వే నంబర్ 16 రిజిస్ట్రేషన్లు నిలిపివేసి 46 మంది రైతులకు న్యాయం చేయాలని డిమాండ్**



**ఆమనగల్లు, జూలై 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 16 భూముల వివాదం మంగళవారం ఉద్రిక్తతకు దారితీసింది. భూముల రిజిస్ట్రేషన్లను వెంటనే నిలిపివేసి అసలు హక్కుదారులైన 46 మంది రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆమనగల్లు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. సర్వే నంబర్ 16లో 46 మంది రైతులకు భూములు ఉండగా, కొందరి వద్ద పట్టాదారు పత్రాలు ఉన్నప్పటికీ భూముల స్వాధీనం లేకపోవడం, మరికొందరికి తమ భూములు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వం కుమ్మరులు, కమ్మరులు, మాలలు, మాదిగలు, ఎరుకల వంటి కులవృత్తుల కుటుంబాలకు ఈ భూములను కేటాయించిందని తెలిపారు. అయితే కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై నకిలీ పత్రాల ఆధారంగా భూములను తమ పేర్లపై పట్టాలు చేయించుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఎమ్మార్వో, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదని, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండగానే మరో వ్యక్తి పేరుపై రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలు సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి, సర్వే నంబర్ 16లో అన్ని రిజిస్ట్రేషన్లను నిలిపివేసి అసలు హక్కుదారులైన 46 మంది రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలో కోనాపూర్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, బాధిత రైతులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని ప్రభుత్వాన్ని వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు.

## విద్యార్థుల విజయమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

**– రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మెన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి**
**– విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టాలి**



**ఆమనగల్లు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు, తల్లిదండ్రులు సాగించిన ప్రజాస్వామ్య పోరాటానికి దక్కిన విజయమని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ చేరికల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న అవకతవకలు, పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలపై విద్యార్థులు చేపట్టిన నిరంతర ఉద్యమాల ఫలితంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడకుండా విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టి, పారదర్శకంగా పరీక్షలు నిర్వహించే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించాలని కోరారు. అంతకుముందు గోలి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు యువకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఆయన, తెలంగాణ అభివృద్ధి, బీఆర్ఎస్ సిద్ధాంతాలపై విశ్వాసంతోనే యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు కల్పిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్, నల్లచెరువు మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, జేపల్లి వార్డు సభ్యులు గోపాల్ నాయక్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాభావంలో ఆరుతడి పంటలే రైతులకు మేలు

**– మండల వ్యవసాయ అధికారి పి. శ్రీనివాస్ గౌడ్**
**– వరికి ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాల సాగు చేపట్టాలి**



**ఆమనగల్లు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరమయ్యే ఆరుతడి పంటలను సాగు చేసి నష్టాలను నివారించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. శ్రీనివాస్ గౌడ్ సూచించారు. ఆమనగల్ రైతు వేదికలో సోమవారం ప్రారంభమైన మూడు రోజుల విత్తన మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు.. జూలై 27 నుంచి 29 వరకు నిర్వహిస్తున్న ఈ మేళాలో కంది, పెసర, మినుములు, ఆముదం, వివిధ రకాల కూరగాయల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు సాగు ప్రణాళికలో మార్పులు చేసుకోవాలని, తక్కువ కాలంలో దిగుబడి వచ్చే, తక్కువ నీటితో పండే పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను సద్వినియోగం చేసుకుని సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు మెరుగైన ఆదాయం పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. విత్తన మేళా ముగిసేలోపు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవసరమైన విత్తనాలను పొందాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నికితా, మీనాక్షి, రైతులు, విత్తనాల
డీలర్లు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
మంగళవారం,
జూలై 28, 2026



# క్వారీ తవ్వకాలు నిలిపివేయాలి..

**– కలెక్టర్‌కు ఆకుతోటపల్లి గ్రామస్థుల వినతి**



**ఆకుతోటపల్లి, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆకుతోటపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 304లో కొనసాగుతున్న మైనింగ్, స్టోన్ క్వారీ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే నంబర్లు 302, 304 పరిధిలో ఏర్పాటు చేసిన స్టోన్ క్రషర్ల కారణంగా గ్రామంలోని పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. క్వారీల నుంచి వెలువడుతున్న దుమ్ము, శబ్ద కాలుష్యంతో విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటోందని, శ్వాసకోశ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దుమ్ము కారణంగా పాఠశాల పరిసరాలు కలుషితమవుతున్నాయని, విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకునే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, క్వారీ పేలుళ్ల వల్ల ఇళ్లకు స్వల్ప కంపనలు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. గ్రామస్థుల వినతిపై స్పందించిన అదనపు కలెక్టర్ సమస్యపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి, మైనింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ లేఖ రాశారు. విచారణ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిసింది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి గ్రామ ప్రజలకు, విద్యార్థులకు ఉపశమనం కల్పించాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు.

# రైతుల ప్రయోజనాలకు విఘాతం..

**– అక్రమ మొండాపై కలెక్టర్‌కు ఫిర్యాదు**
**– ప్రభుత్వ అనుమతులు లేని మొండాను వెంటనే నిలిపివేయాలి**
**– మార్కెట్ డైరెక్టర్ తాళ్ల రవీందర్**



**ఆమనగల్లు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అక్రమ మొండా రైతులు, వ్యాపారులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని ఆరోపిస్తూ మార్కెట్ డైరెక్టర్ తాళ్ల రవీందర్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మొండా నిర్వహిస్తూ రైతులు, వ్యాపారుల నుంచి అనధికారికంగా వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ గుర్తింపు పొందిన వ్యవసాయ మార్కెట్ వ్యవస్థకు కూడా నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ చేపట్టి అక్రమ మొండా నిర్వహణను వెంటనే నిలిపివేయాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతులు, వ్యాపారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని తాళ్ల రవీందర్ విజ్ఞప్తి చేశారు.

# పరుగుల తల్లి ప్రవళికకు ఘన సత్కారం



**దేవరకొండ, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చైనాలో జరిగిన ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్‌లో 4x400 మీటర్ల మహిళల రిలేలో స్వర్ణం సాధించిన నారీమల్ల ప్రవళికను దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. అధ్యక్షుడు ఎన్. విటి సభ్యులతో కలిసి ప్రవళిక మెడలో స్వర్ణ పతకాన్ని వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఒక బీద కుటుంబం నుండి పట్టుదలతో నిరంతర కృషి చేసి భారతదేశానికి స్వర్ణం అందించడం నేటి యువతకు స్ఫూర్తి అని వారు పేర్కొన్నారు. చదువులో కూడా మొదటి ర్యాంకులో నిలవడం గొప్ప విషయమని, తల్లిదండ్రులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ తమ బిడ్డను ప్రోత్సహించి దేశానికి గౌరవం తెచ్చారని అభినందించారు. దేవరకొండ నియోజకవర్గంలో క్రీడా స్థలాలు లేకపోవడం దురదృష్టకరమని అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు అందుబాటులోకి వస్తే మరెన్నో క్రీడాకారులు ప్రవళికలా దేశానికి పేరు తెస్తారని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని, ప్రవళిక లాంటి క్రీడా రత్నాలు మరింతగా తయారవుతారని వారు అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు క్రీడాకారులపై దయ చూపి స్టేడియాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. 12 సంవత్సరాలుగా స్పోర్ట్స్ అసోసియేషన్ స్టేడియాల కోసం పోరాటం చేస్తోందని గుర్తు చేశారు. ప్రవళికను అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా తీర్చిదిద్దిన కోచ్ పరశురాముని కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, రాపోలు నిరంజన్, వై.ఎస్. కరుణాకర్, శైలేష్ వల్లమల్ల ఆంజనేయులు, సన్నీ, కౌన్సిలర్లు పొట్ట మురళి, సాయి చంద్ర గౌడ్, కరాటే మాస్టర్ గోపి, క్రీడాకారులు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

**– గాలి వినోద్ కుమార్**



**ఆమనగల్లు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దళిత కుటుంబాలపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆర్‌పీఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గాలి వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆమనగల్లు పట్టణంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, దళితుల హక్కులను కాలరాసే చర్యలను ప్రభుత్వం ఉపేక్షించకూడదని అన్నారు. భూ వివాదాల పేరుతో అమాయక దళిత కుటుంబాలను వేధించడం తగదని, సంబంధిత ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే ఆర్‌పీఐ ఆధ్వ ర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జంతుక శంకర్, అంబేద్కర్ యువజన సంఘం ఉపా ధ్యక్షుడు వస్పుల సురేష్, అడ్వకేట్ జీవన్ కుమార్, డొక్కా పురుషోత్తం, హాఫీజ్, రామచంద్ర య్య, వస్పుల కృష్ణ, జంతుక శివ, మహేష్, యాదగిరి, శ్రీరామ్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

# వివోఏలకు కాంగ్రెస్ ఇచ్చిన 18 వేల వేతన హామీ వెంటనే అమలు చేయాలి



**నల్లగొండ, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 18 వేల వేతన హామీతో పాటు ఇతర వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 18 వేల కనీస వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ అమలు చేయలేదు. చాలీచాలని వేతనాలతో అర్ధాకలతో వివోఏలు పనిచేయాల్సి వస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. వివోలకు సంబంధంలేని బుధవారం రివ్యూ మీటింగ్స్, ఉల్లాస్ యాప్‌లో పని, ఆన్లైన్ పనులను ఆపాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు, టాప్స్ మరియు నెట్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. "సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగుతుంది" అని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గం సాధించిన చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి దోపిడీకి అవకాశం కల్పించిందని విమర్శించారు. వెంటనే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, రాష్ట్రంలో అమలు చేయబోమని ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. 73 షెడ్యూల్ పరిశ్రమల్లో వేతనాలు పెంపు కోసం ఇచ్చిన జీవోలను సవరించాలని, సేర్ప్ సీఈఓ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిలుముల దుర్గయ్య, పి. సులోచన మాట్లాడుతూ, "వివోఏల సమస్యలు పరిష్కరించకపోతే పెన్‌డౌన్ సమ్మెకు సిద్ధమవుతాం" అని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండంపల్లి సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పెంజర్ల సైదులు, జిల్లా నాయకులు పోలె సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. వెంకన్న, యూనియన్ నాయకులు కె. రేణుక, బి. సురేష్, కే. చంద్రకళ, వై. పాపయ్య, వల్లెపు రాజేశ్వరి, జటావత్ సరోజ, బుర్రి రేణుక, శేఖర్, పద్మ, ఆర్.బి. నాయక్ ధనలక్ష్మి, కే. సువర్ణ, సుజాత, సంతోష, రజిత, సైదులు, సైదమ్మ, లక్ష్మి, అంజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కొండారెడ్డిపల్లిలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పర్యటన

**– కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి గ్రామంలో పర్యటన.. అభివృద్ధి, ప్రజా సమస్యలపై పరిశీలన**



**వంగూరు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామాన్ని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం సందర్శించారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఎనుముల కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు. గ్రామ పర్యటన సందర్భంగా స్థానిక పరిస్థితులను పరిశీలించిన మంత్రి.. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై అధికారులతో చర్చించినట్లు తెలిసింది. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఈ పర్యటన మరోసారి చాటింది. మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నాయకులు, కార్యకర్తలు వారికి స్వాగతం పలికారు. గ్రామస్థులతో స్థానిక సమస్యలపై మాట్లాడి వాటి పరిష్కారానికి సంబంధిత అధికా రులతో సమన్వయం చేయా లని ప్రజా ప్రతినిధులు సూచించినట్లు సమా చారం. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మురళీ మోహన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజశేఖ ర్‌రెడ్డి, వేమారెడ్డి, కృష్ణారెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమ్మె ఒప్పందాలను వెంటనే అమలు చేయాలి : సీఐటీయూ



**నల్లగొండ, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.ఎస్. రెడ్డి, నల్లగొండ డిపో గౌరవాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య తీవ్రంగా విమర్శించారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ ఆర్టీసీ డిపో ముందు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "ప్రభుత్వం--యాజమాన్యంతో జరిగిన చర్చల్లో అంగీకరించిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల కమిటీతో జరిగిన చర్చల ప్రొసీడింగ్స్ కాపీని కార్మిక సంఘాలకు అందించాలి. 2026 మే 21న జరిగిన చర్చల ప్రకారం అలవెన్సులను 80 శాతం పెంచి జూలై జీతాల నుంచే అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు. బ్రెడ్ విన్నర్ స్కీంలో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని, ఆర్టీసీ నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్లకు జూనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత కమిటీని ఏర్పాటు చేసి, అన్ని సంఘాల అభిప్రాయాలతో ప్రతిపాదనలు రూపొందించాలని, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని, పీఎఫ్ హయ్యర్ పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. 2019 సమ్మె సందర్భంగా నమోదు చేసిన పోలీసు కేసులను ఉపసంహరించుకోవాలని, డిపో--రీజియన్ స్థాయిలో కార్మిక సంఘాలతో చర్చించి పని భారాన్ని తగ్గించాలని, మహిళా కార్మికుల ప్రత్యేక సమస్యలను పరిష్కరించాలని, ప్రమోషన్లు పారదర్శకంగా అమలు చేయాలని వారు స్పష్టం చేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ నల్లగొండ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, రీజియన్ ఉపాధ్యక్షులు కె. చంద్రమౌళి, సహాయ కార్యదర్శి శ్యాం సుందర్, డిపో ఉపాధ్యక్షులు సి.హెచ్. రేవతి, సహాయ కార్యదర్శి పి. వెంకటేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వంగూరులో ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌కు స్థల పరిశీలన



**– కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరిశీలన**

**వంగూరు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంగూరు మండల కేంద్రంలో ప్రతిపాదిత ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సోమవారం స్థల పరిశీలన చేశారు. వారి వెంట రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి ఉన్నారు. ప్రతిపాదిత కాంప్లెక్స్ నిర్మాణానికి అనువైన స్థలం, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే విధంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించినట్లు తెలిసింది. వివిధ ప్రభుత్వ సేవలు ఒకే సముదాయంలో అందుబాటులోకి వస్తే ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు తగ్గి, సమయం ఆదా కానుంది. స్థల పరిశీలన సందర్భంగా సంబంధిత అధికారులు ప్రతి పాదిత కాంప్లెక్స్‌కు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. నిర్మాణానికి అవసరమైన ప్రక్రియను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో మురళీమోహన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ుడు రాజశేఖర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నా యకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జైలు భరో విజయవంతం చేయాలని సీఐటీయూ పిలుపు



**కల్వకుర్తి, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం యుటిఎఫ్ కార్యాలయంలో జైలు భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజాస్వామ్యవాదులు కార్పొరేట్ పెట్టుబడిదారుల, మతోన్మాదుల వ్యతిరేకంగా పోరాడాలి. దేశాన్ని కాపాడుకోవాలి" అని అన్నారు. బీజేపీ ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణలను దుందుడుకుగా అమలు చేస్తోందని, లేబర్ కోడ్ ఫైనల్ రూల్స్ నోటిఫై చేయడం, విద్యుత్ సవరణ బిల్లు 2025, విత్తన చట్ట సవరణలు ప్రతిపాదించడం ప్రజా వ్యతిరేక చర్యలని ఆయన విమర్శించారు. "సులభ తర వ్యాపారం పేరుతో కార్మిక చట్టాలను రద్దు చేసి, పని దినాన్ని ఎనిమిది గంటల నుండి 12 గంటలకు పెంచుకునేందుకు యాజమాన్యాలకు స్వేచ్ఛ ఇచ్చారు. సమ్మె హక్కును కాలరాసి ఆంక్షలు విధించారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్‌ను కష్టతరం చేయడం, కార్మిక--రైతు--ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయడం కేంద్ర బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఎండగట్టారు. గ్రామాలు, బస్తీలు, పారిశ్రామిక ప్రాంతాల్లో విస్తృతంగా సభలు, సమావేశాలు నిర్వహించి జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింత ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వర్ధన్ పర్వతాలు, నాయకులు యాదయ్య, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణయ్యతో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పులిజాల పరశురాములు



**కల్వకుర్తి, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా తాడూర్ మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఏఐటీయూసీ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప కార్యదర్శి నరసింహ హాజర య్యారు. మహాసభ అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన పులి జాల పరశురాములును ఏఐటీయూసీ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక పత్రాన్ని అందజేశారు. ప్రజల కోసం నిరంతరం గళం విప్పుతూ, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న వ్యక్తిగా పార్టీ గుర్తించి, ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా పులిజాల పరశురాములు మాట్లాడుతూ, "నా మీద నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.

## మూడేళ్ల రైతు కష్టానికి దక్కిన ప్రతిఫలం



**ఎలిగేడు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని శివపల్లి గ్రామానికి చెందిన రైతు జూనేని శ్యాంసుందర్ రావు తన రెండు ఎకరాలలో సాగుచేసిన ఆయిల్‌పామ్ తోట నుండి మూడేళ్లకు కోతలు ప్రారంభమవడంతో కష్టానికి ప్రతిఫలం అందుకున్నాడు. ఆయిల్‌పామ్ ప్రస్తుతం టన్నుకు రూ.23,800 ధర ఉండగా, వరుసగా మూడు నెలల్లో మొత్తం 6.3 టన్నుల దిగుబడితో రూ.1,49,940 ఆదాయం లభించింది. మే నెలలో 1.5 టన్నుల దిగుబడితో రూ.35,700, జూన్ నెలలో 2.3 టన్నుల దిగుబడితో రూ.54,740, జూలై నెలలో 2.5 టన్నుల దిగుబడితో రూ.59,500 రైతుకు లభించిందని మండల అధికారి ఎన్. అభిలాష్ వివరించారు. ఆయిల్‌పామ్ ఒకసారి నాటితే అనేక సంవత్సరాలపాటు నిరంతర ఆదాయం అందించే పంట అని, శాస్త్రీయ యాజమాన్యం, సరైన ఎరువుల వినియోగం, సమయానికి కోతలు చేపడితే ప్రతి రైతు ఇలాంటి విజయాన్ని సాధించగలడని ఆయన పేర్కొన్నారు. "ఈనాడు నాటిన ఆయిల్‌పామ్ రేపటి రైతు కుటుంబ ఆర్థిక భద్రతకు బలమైన పెట్టుబడిగా నిలుస్తుంది. స్థిరమైన దీర్ఘకాలిక ఆదాయాన్ని అందించే అత్యుత్తమ పంట" అని అభిలాష్ స్పష్టం చేశారు.

## యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



**కల్వకుర్తి, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ గ్రౌండ్‌లో జరుగుతున్న శ్రీకృష్ణ కాలచక్రం శ్రీ సీతారామస్వామి సామ్రాజ్య పట్టాభిషేకం చతుర్వేద పూర్వక మహాగణపతి, మహాసౌర, సుదర్శన, విష్ణు పంచయతనం, లక్ష్మీనారాయణ సహిత శ్రీమద్భాగవత 91వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "శ్రీశ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామీజీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ యాగం కులమతాలకు అతీతంగా జరగడం ఎంతో అదృష్టం. కల్వకుర్తి ప్రాంత ప్రజలు సుభిక్షంగా ఉండాలని, వానలు సమృద్ధిగా కురవాలని, ప్రజలందరూ ఆరోగ్య సుఖశాంతులతో జీవించాలని యాగ ఫలితం ఫలించాలి" అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాగ కమిటీ ముఖ్యులు జూలూరి రమేష్ బాబు, తాలూకా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు బీచాని బాలకృష్ణ, కమిటీ సభ్యులు మదన మురళి, పోల సురేందర్, దాచేపల్లి మనోహర్, దారామోని గణేష్, శివప్రసాద్, బొమ్మ ఆంజనేయులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**కల్వకుర్తి, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండల పరిధిలోని మార్చాల గ్రామ గేటు సమీపంలో కోదాడ--జడ్చర్ల జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని లింగస్వామిపల్లి గ్రామానికి చెందిన భగవంతు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించిందని ఆయన వివరించారు.

## బి ఆర్ ఆర్ నగర్‌లో వరుణుడికోసం జలాభిషేకం



**నందికొట్కూరు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా సకాలంలో వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని బి ఆర్ ఆర్ నగర్లో వెలసిన శ్రీ శ్రీశ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామికి జలాభిషేకం నిర్వహించారు. సృష్టి, స్థితి, లయకారకులలో ఒకరైన అభిషేక ప్రియుడు బోలా శంకరుడికి గంగాజలంతో మహామంగళహారతి సమర్పిస్తూ కాలనీవాసులు బ్రహ్మముహూర్తం నుండి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. "ఓం నమః శివాయ" మంత్రోచ్చారణల మధ్య స్వచ్ఛమైన నీటితో శివలింగానికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు మాట్లాడుతూ, "పరమశివుని అనుగ్రహం కోసం శుభ్రతతో ఆలయానికి వెళ్లి, రాగి లేదా వెండి చెంబుతో నీటిని సమర్పిస్తూ జలాభిషేకం చేస్తే సకాలంలో వర్షాలు కురుస్తాయని పురాణాలు, ఇతిహాసాలు చెబుతున్నాయి. అభిషేక సమయంలో బిల్వపత్రాలు సమర్పిస్తే అత్యంత శుభఫలితం లభిస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు, భక్తులు పాల్గొని వరుణుడి కరుణ కోసం ప్రార్థనలు చేశారు.

## గొర్రెల మేకల పెంపకదారుల సొసైటీ ఎన్నికలు జరపాలని డిమాండ్



**కల్వకుర్తి, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్రంలో గొర్రెల--మేకల పెంపకదారుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించినప్పటికీ, ఇంకా పలు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర అధ్యక్షులు ఖిల్లా గోపాల్ పేర్కొన్నారు. సోమవారం కల్వకుర్తి యుటిఎఫ్ భవనంలో జరిగిన జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, "ప్రతి గ్రామంలో సొసైటీ ఎన్నికలు జరిపి, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను సొసైటీ అధ్యక్షుల ద్వారా రైతులకు అందించాలి. చనిపోయిన గొర్రెలకు ఇన్సూరెన్స్ ప్రకటించి, పిడుగుపాటు వల్ల మృతి చెందిన గొర్రెల కాపరులకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలి. ఫారెస్ట్ ప్రాంతాల్లో గొర్రెలను స్వేచ్ఛగా మేపుకునేందుకు అనుమతులు ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు. అలాగే, ప్రతి సొసైటీ ఉన్న గ్రామంలో 5 ఎకరాల భూమి కేటాయించి, సంచార వైద్యశాలలు ఏర్పాటు చేసి గొర్రెల--మేకలకు ఉచిత మందులు అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నాగర్‌కర్నూల్ జిల్లా మహాసభలో కొత్త కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా జట్టపు మల్లయ్య, కార్యదర్శిగా చిన్న శ్యామ్ సుందర్, ఉపాధ్యక్షులుగా గొడుగు వెంకటయ్య, రామకృష్ణ, వంగూరు యాదమ్మ, సహకారదర్శులుగా శ్రీనివాసులు, పరశురాములు, పాల వెంకటేష్ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా బక్కయ్య, రామకృష్ణ, పత్తి వెంకటస్వామి, కడారి యాదయ్య, బాలస్వామి, రాజు, రాములు ఎంపిక య్యారు. ఈ మహాసభలో ప్రజా సంఘాల నాయకులు వర్ధన్ పర్వతాలు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి. ఆంజనేయులు, సీ. ఆంజనేయులు, బాలస్వామి, రజక సంఘం రాష్ట్ర నాయకులు ఎం. కృష్ణయ్య, నూనె శ్రీను, మాజీ కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యం

### – ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజానికి ఉత్తమ పౌరులను అందించవచ్చని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి, ప్రభుత్వ కళాశాలల్లో ప్రథమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ సహకారంతో ప్రశంసాపత్రాలు, మెడల్స్, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కష్టపడి చదివి అద్భుతమైన ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా మరింత కృషి చేయాలని సూచించారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమాలు మరింత మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, ఎంఈవో చాంప్లా నాయక్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య, అజీమ్, సర్పంచ్ కటికల శేఖర్, హెచ్ఎం ఝాన్సీ, క్లాస్‌మేట్ క్లబ్ నిర్వాహకులు రాఘవేందర్, ఉపసర్పంచ్ నూకం కోటేశ్వర్, మోహన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ నాయకులు భగవాన్ రెడ్డి, పాఠశాల చైర్మన్ కటికల సరిత, నాయకులు మల్లేష్, సురేష్, రాజు రెడ్డి, రఘు, రాములు, డిగ్రీ కృష్ణ, ఆరిఫ్, అజీజ్, రాజేందర్, రాములు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజలకు త్వరలో ఆధునిక వైద్య సేవలు..

### – ప్రభుత్వ ఆసుపత్రి పనులను తనిఖీ చేసిన ఈఈ రామ్మోహన్ రెడ్డి



**ఆమనగల్లు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు పట్టణంలో రూ.17.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) రామ్మోహన్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈ కోటయ్యతో కలిసి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, పనులు వేగవంతంగా, నాణ్యతతో కొనసాగి నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఈఈ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన, ఆధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.17.50 కోట్ల వ్యయంతో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మిస్తోందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి లోపాలకు తావు లేకుండా ప్రతి దశను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేసి ఆసుపత్రిని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఆమనగల్లు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీలో డీఈ కోటయ్య, కేవీఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా, సైట్ ఇన్‌చార్జి శంకర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జలధార కృషికి కలెక్టర్ అభినందనలు



**నంద్యాల, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జల సంరక్షణలో నంద్యాల జిల్లా సాధించిన విశిష్ట విజయానికి కృషి చేసిన జలధార బృందాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అభినందించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో "క్యాచ్ ది రైన్" కార్యక్రమంలో నంద్యాల జిల్లా పనితీరును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మన్ కీ బాత్లో ప్రత్యేకంగా ప్రశంసించడంపై అధికారులు కలెక్టర్‌ను అభినందించారు. కార్యక్రమం విజయవంతం కావడంలో కీలకపాత్ర పోషించిన డీడబ్ల్యూఎంఏ పీడీ సూర్యనారాయణ, మైనర్ ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, వాటర్ రిసోర్సెస్ ఎస్ఈ శంకర్ రెడ్డి, గ్రౌండ్ వాటర్ డీడీ రఘురామ్తో పాటు సంబంధిత అధికారులను కలెక్టర్, ఆర్డీఓ విశ్వనాథ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "మన్ కీ బాత్ కార్యక్రమంలో గుర్తింపు లభించడం నాకు ఇది నాలుగోసారి. గతంలో విజయనగరం జిల్లాలో స్వచ్ఛభారత్ మిషన్‌లో మరుగుదొడ్ల నిర్మాణం, 'చిట్టి గురువులు' పేరుతో వయోజన అక్షరాస్యత కార్యక్రమం, వయోజన విద్య కోసం ప్రత్యేక పాఠ్యపుస్తకం రూపొందించడం వంటి కార్యక్రమాలు జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందాయి" అని గుర్తు చేశారు. జలధార కార్యక్రమంలో అవార్డు కోసం కాకుండా ప్రజల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేసినప్పటికీ, దేశంలోని 802 జిల్లాల్లో 21వ స్థానం, దక్షిణ భారత జోన్‌లో 10వ స్థానం, రాష్ట్రంలో 4వ స్థానం సాధించడం గర్వకారణమని తెలిపారు. "దేశంలో ప్రస్తుతం టాప్-50లో ఉన్నందున రూ.25 లక్షల అవార్డు వచ్చే అవకాశం ఉంది. ఇదే స్ఫూర్తితో మరింత కృషి చేసి దక్షిణ జోన్‌లో అగ్రస్థానాన్ని సాధించి రూ.1 కోటి అవార్డును నంద్యాల జిల్లాకు తీసుకురావాలి" అని కలెక్టర్ అధికారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ లీలావతి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఉపాధి కల్పనాధికారి సోమశివారెడ్డి, డిఎల్డిఓ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఛాంబర్‌లో జలధార బృందం అధికారులు ఆయనను శాలువా, మొమెంటోతో అభినందించారు.

## కరువు ప్రాంతంగా ప్రకటించాలి



**నందికొట్కూరు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖరీఫ్ సీజన్‌లో రైతుల పంట నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, నందికొట్కూరు వ్యవసాయ సబ్-డివిజన్ పరిధిలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను కరువు ప్రాంతంగా ప్రకటించాలి అని సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం అఖిల భారత కిసాన్ మహాసభ ఆధ్వర్యంలో నందికొట్కూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు గిరీష్కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో నందికొట్కూరు, మిడుతూరు, జూపాడు బంగ్లా, పగిడ్యాల మండలాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విత్తిన విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలకెత్తిన పంటలు తేమ లేక ఎండిపోవడం వల్ల రైతులు రెండోసారి విత్తనాలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడి భారీ ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్-డివిజన్ పరిధిలో సాధారణంగా 33 వేల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా, వర్షాభావం కారణంగా కేవలం 16,500 హెక్టార్లలో మాత్రమే సాగు జరిగిందని, అంటే సుమారు 50 శాతం తగ్గిందని తెలిపారు. సాధారణ వర్షపాతంతో పోలిస్తే ఈ సీజన్‌లో కేవలం 54 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని, పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నాలుగు మండలాలను వెంటనే కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించాలని, ప్రత్యేక బృందాలతో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, నష్టపరిహారం, ఉచిత విత్తనాలు, ఎరువులు అందించాలని కోరారు. అదేవిధంగా వ్యవసాయ రుణాల మాఫీ, పంట రుణాల రీషెడ్యూల్, పంట బీమా నష్టపరిహారం, పశువులకు మేత శిబిరాలు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. "రైతాంగం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితిని ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి, అత్యవసర సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య



**నందికొట్కూరు, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పేదల పాలిటి పెన్నిధిగా నిలుస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నిరుపేదల ఆరోగ్య భద్రతకు భరోసానిస్తోందని నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య అన్నారు. కొత్తపల్లి మండల పరిధిలో లబ్ధిదారులకు మంజూరైన రూ.5,71,588 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మెల్యే స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆర్థిక స్థోమత లేక కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి కొండంత అండగా నిలుస్తోంది. సమయానికి వైద్యం అందక అప్పుల పాలవుతున్న ఎన్నో కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఈ నిధి ద్వారా ఆదుకుంటోంది" అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనేదే తమ సంకల్పమని స్పష్టం చేసిన ఆయన, నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసిన బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా నిధులు మంజూరయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి మండల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మాఫియా అరాచకాలు.. మత్తులో పోలీసులపైకి కారును నడిపిన యువకుడు

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో డ్రగ్స్ మాఫియాపై నిఘా పెట్టిన పోలీసులపై ఓ నిందితుడు కారుతో దూసుకెళ్లిన ఘటన తీవ్ర కలకలం రేపింది. డ్రగ్స్ మత్తులో ఉన్నట్లు భావిస్తున్న యువకుడు తనను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై వాహనం ఎక్కించడంతో హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ఇన్‌స్పెక్టర్‌తో పాటు కానిస్టేబుల్‌కు కూడా స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై పో లీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిం దితుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అబిడ్స్ ప్రాంతంలో డ్రగ్స్ కొనుగోలు, విక్రయాలు జరుగుతున్నట్లు హెడ్ కాని స్టేబుల్ మహేందర్ యాదవ్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం అబిడ్స్‌లో నిఘా ఏర్పాటు చేసింది. ఈ



క్రమంలోనే అబిడ్స్‌లోని పాయల్ ఫుట్‌వేర్ సమీపానికి బెలెనో కారులో వచ్చిన సైఫ్‌కు మరో వ్యక్తి అనుమానాస్పద ప్యాకెట్ అందజేశాడు. వెంటనే పోలీసులు ప్యాకెట్ ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కారులో ఉన్న సైఫ్‌ను బయటకు రావాలని ఆదేశించారు.అయితే కారు ఆపుతున్నట్లు నటించిన సైఫ్ ఒక్కసారిగా రివర్స్‌లో వేగంగా నడిపి పోలీసులపైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ కాలిపై నుంచి కారు వెళ్లడంతో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. వైద్యుల పరీక్షల్లో అతడి కాలు విరిగినట్లు నిర్ధారణ కావడంతో సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. నిందితుడిని అడ్డుకునే ప్రయత్నంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కానిస్టేబుల్ వంశీధర్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి.ఈ ఘటన తర్వాత పరారయ్యేందుకు ప్రయత్నించిన సైఫ్‌ను పోలీసులు వెంటాడి అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో కారుతో పాటు అదుపులోకి తీసుకున్నారు. హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం సైఫ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్, ప్యాకెట్‌లోని పదార్థం, ఘటనకు సంబంధించిన ఇతర కోణాలపై విచారణ కొనసాగిస్తున్నారు. డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు కొనసాగుతాయని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు.

## పి.జి.ఆర్.ఎస్ ఫిర్యాదులపై అలసత్వం వద్దు జిల్లా ఎస్పీ




**నంద్యాల, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ప్రజల నుంచి 120 ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి, ప్రతి ఫిర్యాదుపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. "చట్ట పరిధిలో ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలి. నిర్ణీత గడువులోపు ఫిర్యాదులను పరిష్కరించాలి. పునరావృతం కాకుండా చూడాలి. ఫిర్యాదుల పట్ల అలసత్వం వద్దు" అని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి తప్పనిసరిగా అందజేయాలని ఆయన సూచించారు.

## నాణ్యమైన విద్యకు ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకం కలెక్టర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, జూలై 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో ప్రధానోపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల (అమర్ నగర్)లో రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి ఆధ్వర్యంలో జరుగుతున్న మూడు రోజుల సమగ్ర సేవా శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ లిటరసీ వంటి ఆధునిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల అభ్యసన ప్రమాణాలను పెంచాలని అన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు, శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఆధునిక సాంకేతిక అంశాలను బోధనలో భాగం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తే పెద్దపల్లి జిల్లా విద్యా రంగంలో ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శారద, విద్యాశాఖ అధికారులు, ఎస్సిఈఆర్టి ప్రతినిధులు, మాస్టర్ ట్రైనర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# హైడ్రా దారుణాలకు హైకోర్టు చెక్.. అధికారులపై చర్యలు తప్పవు


**హైదరాబాద్, జులై 27:** హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌ను తొలగించాలని తెలంగాణ హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ నేత ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా చేసిన దారుణాలు అన్ని ఇన్ని కావన్నారు. 63 కోర్టు ధిక్కరణ కేసులు హైడ్రా కమిషనర్‌పై ఉండటంతో ప్రభుత్వ క్రూరత్వానికి ఇది అద్దం పడుతోందని మండిపడ్డారు. హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని సీఎం రేవంత్ రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశామన్నారని పేర్కొన్నారు. లోతుకుంట, బహదూర్ గూడ, అమీన్‌పూర్‌లో హైడ్రా చేసిన అరాచకాల చిట్టా చాలా పెద్దదని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిధిలోని మున్సిపల్ శాఖకు సంబంధించినదే ఈ హైడ్రా అని ఆర్ఎస్



ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. హైకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంప దెబ్బ అని అభివర్ణించారు. సీఎం పదవిలో రేవంత్ రెడ్డి కొనసాగే నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు. పేదలకో న్యాయం.. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఇంటికో న్యాయమా? అని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని రియల్ దందాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎ.వి. రంగనాథ్‌ను అరెస్టు చేయాల్సిందని.. కానీ తెలంగాణ హైకోర్టు దయ చూపిందని అన్నారు. ఈ రోజు రంగనాథ్.. రేపు డీజీపీ, సీసీఎల్ఏ కోర్టు గుమ్మం ఎక్కాల్సి ఉంటుందని వివరించారు. అధికారులు కూడా రూల్ బుక్ ఫాలో కావాలని ఆయన అభిప్రాయపడ్డారు. తప్పు చేసిన అధికారులపై బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చర్యలుంటాయని నేత ఆర్ ఎస్ ప్రవీణ్ హెచ్చరించారు.

# ట్రైనీ ఐపీఎస్ లైంగిక వేధింపుల కేసులో మరో ట్విస్ట్

**హైదరాబాద్:** నేషనల్ పోలీస్ అకాడమీలో తనపై వేధింపులకు పాల్పడ్డాడని మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఉదయ్? కృష్ణారెడ్డిపై ఈ నెల 18న అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా నిందితుడు తెలిపిన రెండు చిరునామాల్లోనూ నోటీసులు ఇచ్చేందుకు వెళ్లగా, పోలీసులకు అతడి ఆచూకీ లభించలేదు. మొబైల్ కూడా స్విచ్ఛాఫ్ అని వస్తున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.జూన్ 20వ తేదీన ఉదయం అపస్మారక స్థితిలో ఎస్సార్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన నిందితుడు ఉదయ్కృష్ణారెడ్డి ఆరోగ్యం కుదుటపడిన సంగతి తెలిసిందే. జూన్ 22న ఆయనను హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేశారు. తదుపరి విచారణ ఎల్లుండికి వాయిదా : తనపై అత్తాపూర్ ఠాణాలో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి జూన 21న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఐపీఎస్?కు ఎంపికై శిక్షణకు ముస్సోరి వెళ్లినప్పటి నుంచి ఫిర్యాదుదారుతో ప్రేమలో ఉన్నానని, వివాహం చేసుకోవాలని అనుకున్నామని, ఈ దశలో ఆర్థికంగా కూడా చేయూతనిచ్చినట్లుగా ఉదయ్ కృష్ణారెడ్డి తన



పిటిషన్‌లో తెలిపారు. కానీ ఫిర్యాదుదారు ఓ ఐఏఎస్ ఆఫీసర్‌ను పెళ్లి చేసుకున్నారన్నారు. తిరిగి ఆ అనుబంధాన్ని కొనసాగించాలని తనను కోరుతూ వచ్చారని పిటిషనర్? పేర్కొన్నారు. ఫిర్యాదుదారు మొదట అకాడమీ అధికారులకు, తర్వాత పోలీసు స్టేషన్?లో ఫిర్యాదు చేశారన్నారు. అయితే ఈ రెండింటిలోనూ భిన్నమైన ఆరోపణలున్నాయని తన పిటిషన్‌లో వివరించారు. ఈ నేపథ్యంలో విచారణ లేకుండా నమోదు చేసిన కేసును కొట్టివేయాలని ఉదయ్ కృష్ణారెడ్డి కోరారు. గతంలో వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను నేటికి వాయిదా వేయడంతో విచారణ జరిగింది. అదనపు పీపీ జితేందర్? రావు వివరాలు సమర్పించడానికి సమయం కోరడంతో తదుపరి విచారణ మరోసారి ఎల్లుండికి వాయిదా వేసింది.అసలేం జరిగిందంటే : హైదరాబాద్‌లోని సర్దార్? వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఓ మహిళా ట్రైనీ ఐపీఎస్?పై లైంగిక వేధింపులు, బ్లాక్?మెయిలింగ్?కు పాల్పడ్డారనే ఆరోపణలపై ఉదయ్? కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్? స్టేషన్?లో కేసు నమోదైంది. ఈ కేసుతో తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఉదయ్ కృష్ణారెడ్డి అసభ్యకర మెసేజ్‌లు పంపాడని, తన ఫోన్ లాక్ను పాస్‌వర్డ్ చెప్పాలని బెదిరించాడని పట్టుకుని దాడి చేశాడని, మెడకు కత్తిపెట్టి బెదిరించాడని తెలిపారు. శారీరకంగా వేధించి అసభ్యకరంగా ప్రవర్తించాడని, అనుమతి లేకుండా ప్రైవేట్ వీడియోలు తీశాడని, ఆ వీడియోలను తన భర్తకు పంపిస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.నాటకం, సానుభూతి కోసమే ఇలా : మరోవైపు తనపై వచ్చిన ఫిర్యాదులు, ప్రచారాలు అవాస్తవమంటూ ఉదయ్ కృష్ణారెడ్డి ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. చట్టంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, న్యాయం గెలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం మోతీనగర్‌లోని బంధువు ఇంటికి వచ్చిన ఉదయ్ కృష్ణారెడ్డి ఉదయం మద్యం తాగి అపస్మారక స్థితిలో వెళ్లాడు. కానీ ఆత్మహత్యప్రయత్నం చేసి, ఆసుపత్రి పాలైనట్లు ప్రచారం జరిగింది. అయితే ఇదంతా నాటకమని, సానుభూతి కోసమే ఇలా చేసినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఉదయ్?, ఈ నెల 22న హాస్పిటల్? నుంచి డిశ్చార్జి అయ్యారు. తాజాగా అతడి ఆచూకీ లభించడం లేదంటూ పోలీసులు చెప్పడం గమనార్హం. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్కృష్ణారెడ్డి పిటిషన్‌పై విచారణ ఎల్లుండికి వాయిదా పడింది. వివరాలు సమర్పించడానికి అదనపు పీపీ జితేందర్ రావు సమయం కోరారు.

# అభివృద్ధి ముసుగులో అధికార దుర్వినియోగం

**కోదాడ, జూలై 27 :** కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి ముసుగులో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి దంపతులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కమీషన్ల పేరిట కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇందులో భాగంగానే కోదాడ పట్టణంలోఅండర్ డ్రైనేజీ పనుల్లో కమీషన్ల కోసం కే ఎల్ ఎస్ ఆర్ పేరుతో బ్లాక్ లిస్టులో ఉన్న ఓ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టిన విషయాన్ని ఆయన ఆధారాలతో బహిర్గతపరిచారు. సదరు కాంట్రాక్టర్ ది చీకటి చరిత్ర అని, ఆయనపై ఇప్పటికీ కోర్టులో కేసులు ఉన్నాయని , డ్రైనేజీ పనులను ఆయనకు కట్టబెట్టడంలో ఆంతర్యం ఏమిటో జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు నిగ్గు తేల్చాలన్నారు. వాస్తవ టెండర్ లో రూ.182 కోట్లు కోట్ చేస్తే



ప్రకటనలో మాత్రం రూ.258కోట్లుగా ఉండడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తేడాగా ఉన్న రూ.72 కోట్ల మతలబెంటో నిగ్గు తేల్చాలని, బ్లాక్ లిస్ట్ లో ఉన్న కాంట్రాక్టర్ కు టెండర్ ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.డ్రైనేజీ తాము వ్యతిరేకం కాదని, నాసిరకం పైపులతో నిర్మాణం చేస్తే పారిశుధ్య లోపంతో అస్తవ్యస్తమై పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురవుతారనేదే తమ ఆవేదన అన్నారు.

# గ్రీన్ ఇండియా ఛాలెంజ్.. మొక్కలు నాటిన జెన్‌జీలు



**హైదరాబాద్ :** నీట్ పేపర్ లీకేజీలో కేంద్ర ప్రభుత్వం మీద వ్యతిరే కంగా ధర్నా చేసి విజయం పొందిన జెన్‌జీలు సింధు రెడ్డి, అస్మా, ప్రత్యూష హైదరాబాద్ లోని వెంగళ్‌రావు పార్క్‌లో మొక్కలు నాటి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎల్‌నినో ప్రభావం తగ్గి వర్షాలు కురియాలన్నా స్వచ్ఛమైన గాలి లభించాలన్నా విరివిగా మొక్కలు నాటాలని పేర్కొన్నారు. యువకులు తలుచుకుంటే చెయ్యలేనిది ఏమీ లేదు అన్నారు.జెన్‌జీలు అందరు ఒక్కో మొక్క నాటిన దేశంలో పచ్చదనం పెరుగుతుందన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమం ప్రారంభించిన మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర కోర్డినేటర్ గర్రెపల్లి సతీష్, కయ్య వెంకటేష్, కిరణ్ రాథోడ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతికి కొత్త అధ్యక్షురాలు.. ఆ పోస్టులో కొనసాగనున్న కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్:** తెలంగాణ సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతికి కొత్త అధ్యక్షురాలు నియమితులయ్యారు. గత రెండు దశాబ్దాలుగా సంస్థను ముందుండి నడిపించిన కల్వకుంట్ల కవిత ఇకపై ఫౌండర్ ఛైర్‌పర్సన్‌గా మాత్రమే కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో సంస్థ కొత్త అధ్యక్షురాలిగా మారిపల్లి మాధవికి బాధ్యతలను అప్పగిస్తూ సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసిన కవిత.. సంస్థ ప్రయాణంలో ఇది ఒక సరికొత్త అధ్యాయమని పేర్కొంది. భవిష్యత్తులో తెలంగాణ ఆత్మగౌరవం, సాంస్కృతిక పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతామనే దృఢ విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు.తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీ



వం, ఆత్మగౌరవ పరిరక్షణే జాగృతి ప్రధాన ధ్యేయమని కల్వకుంట్ల కవిత గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్న తరుణంలో తెలంగాణ చరిత్ర, సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయాలనే సత్సంకల్పంతో 2006లో ఈ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి బలమైన సాంస్కృతిక రూపాన్ని అందించడంలో జాగృతి అగ్రగామిగా నిలిచిందని, మన ప్రాంత ప్రత్యేకతలను దేశవ్యాప్తంగా చాటిచెప్పేందుకు నిరంతరం శ్రమించిందని వెల్లడించారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని, కొత్త నాయకత్వంలో సంస్థ మరింత బలోపేతమవుతుందనే పూర్తి ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.తెలంగాణ పల్లెలకే పరిమితమైన అపురూపమైన బతుకమ్మ పండుగను నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేయడంలో జాగృతి చేసిన కృషి చరిత్రాత్మకమని కవిత పేర్కొన్నారు. బతుకమ్మ వేడుకల ద్వారా మహిళలను పెద్ద ఎత్తున సంఘటితం చేసి, తెలంగాణ ఉద్యమంలో వారిని క్రియాశీల భాగస్వాములను చేసిన ఘనత ఈ సంస్థకే దక్కుతుందని కొనియాడారు. కేవలం రాజకీయ, ఉద్యమ వేదికగానే కాకుండా అనేక సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి తమ సంస్థ నిరంతరం కృషి చేసిందని వివరించారు. రాబోయే రోజుల్లోనూ ప్రజా సంక్షేమం, సాంస్కృతిక పరిరక్షణే లక్ష్యంగా జాగృతి తన ప్రయాణాన్ని మరింత వేగవంతం చేయనుందని చెప్పారు.కాగా, కవిత తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. పార్టీ వ్యతిరేక కలపాలకు పాల్పడుతుందని ఆమెను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత ఆమె కొన్నాళ్లు జాగృతి ద్వారానే పొలిటికల్‌గా యాక్టివ్ అయ్యారు. అనంతరం తెలంగాణ రక్షణ సేన (-) పేరుతో కొత్త పార్టీని స్థాపించి ప్రజలతో మమేకమవుతున్నారు. -

# చనిపోవడానికి ఉన్న ధైర్యం బతకడానికి ఎందుకు చూపించరు

**అమరావతి, జులై 27:** సీఎం చంద్రబాబు రంప చోడవరం పర్యటనలో తన ప్రసంగంతో ఆకట్టుకున్న పదో తరగతి విద్యార్థిని ఎం. శివాని చనిపోవడం చాలా విషాదం కలిగించిందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి శివాని మృతిపై సోమవారం రాజధాని అమరావతిలో ఆమె స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో వేదికపై ఉత్సాహంగా మాట్లాడిన శివానీ ఇక లేదంటే నమ్మలేక పోతున్నానని అన్నారు. ఎంతో భవిష్యత్ ఊహించుకుని.. కలలుకన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరమని పేర్కొన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు బలం కావాలి.. కానీ బలహీనత కాకూడదని వ్యాఖ్యానించారు. కారణాలు ఏమైనా తన కలలు నిజం కాకుండానే విద్యార్థిని తనువు చాలించిందని చెప్పారు. ఈ విద్యార్థిని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. జీవితంలో సమస్యలు, కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడాలని విద్యార్థులు, యువతకు ఈ సందర్భంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి సూచించారు. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోనుకా వొద్దని విద్యార్థులను



కోరారు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుందని స్పష్టం చేశారు. చనిపోవడానికి ఉన్న ధైర్యం బతకడానికి ఎందుకు చూపించరంటూ విద్యార్థులను ప్రశ్నించారు. బతికి ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు ఈ సందర్భంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు. అల్లూరి మన్యం జిల్లాలో రంపచోడవరంలోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శివాని 10వ తరగతి చదువుతోంది. జులై 24వ తేదీన రంపచోడవరంలో మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతోపాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శివాని.. తన ప్రసంగంతో అందరినీ ఆకట్టుకుంది.

# మహిళా ఐపీఎస్‌పై వేధింపుల కేసు - అజ్ఞాతంలోకి నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డి

**అమరావతి, జులై 27:** తోటి మహిళా ఐపీఎస్ అధికారిణిని వేధించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లాడు. జాతీయ పోలీసు అకాడమీలో తనను వేధించాడంటూ బాధిత మహిళా అధికారిణి ఇచ్చిన ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణ ఎదుర్కొంటున్న నిందితుడు ఉదయ్ ప్రస్తుతం పోలీసులకు అందుబాటులో లేకుండా పోయారు. ఆ రెండు అడ్రస్‌లలో ఆచూకీ గల్లంతు : బాధిత అధికారిణి ఫిర్యాదు మేరకు ఈ నెల 18న అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు బాధ్యతలను ఉన్నతాధికారులు మహిళా భద్రతా విభాగానికి (ఉమెన్ సేఫ్టీ వింగ్) అప్పగించారు. విచారణలో భాగంగా నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు వెళ్లారు. నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించిన రెండు చిరునామాలకు వెళ్లిన పోలీసులకు ఊహించని పరిణామం ఎదురైంది. ఆ రెండు చోట్లా అతడి ఆచూకీ లభించలేదు. అతడి మొబైల్ ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తోందని పోలీసులు తాజాగా



వెల్లడించారు. అమానుష వేధింపులు : తోటి అధికారితో ఉదయ్ ప్రవర్తించిన తీరుపై బాధితురాలు ఫిర్యాదులో పలు ఆరోపణలు చేశారు. ఈ ఏడాది జూన్ 23వ తేదీ నుంచి ఉదయ్ తనను వేధించడం మొదలుపెట్టాడని ఆమె పేర్కొన్నారు. పదే పదే అసభ్యకరమైన మెసేజ్‌లు పంపుతూ మానసిక క్షోభకు గురిచేశాడని ఆరోపించారు. అంతటితో ఆగకుండా, వేరే వారితో తనకు వివాహేతర సంబంధం ఉందంటూ తప్పుడు ప్రచారం చేశాడని వాపోయారు. తన చేతిలో నుంచి బలవంతంగా మొబైల్ ఫోన్ లాక్కున్నాడని చెప్పారు. అందులోని వ్యక్తిగత మెసేజ్‌లు చూసి ఇబ్బందులకు గురిచేశాడని వివరించారు. తన వ్యక్తిగత వీడియోలను రహస్యంగా తీశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వీడియోలను తన భర్తకు పంపి, బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు. లేఖలో కీలక విషయాలు : ఈ కేసు వ్యవహారంలో ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించి గతంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతడు ఆత్మహత్యాయత్నం చేయడం, అంతకుముందు ఓ లేఖ రాశారు. ఆ లేఖలో ట్రైనీ మహిళా ఐపీఎస్‌తో తనకు ఉన్న సంబంధం గురించి ఉదయ్ ప్రస్తావించాడు. ట్రైనీ ఐపీఎస్ బ్యాచ్‌మేట్‌తో తాను ఏడాదిగా సన్నిహితంగా ఉన్నట్లు అందులో పేర్కొన్నాడు. ఇందుకు సంబంధించి తన వద్ద వీడియో ఆధారాలు కూడా ఉన్నాయని లేఖలో స్పష్టం చేశాడు. కేసు కొట్టివేయాలంటూ కోర్టుకు : తనపై అత్తాపూర్ పోలీసులు పలు సెక్షన్ల కింద నమోదు చేసిన కేసును రద్దు (క్వాష్) చేయాలంటూ ఉదయ్ కృష్ణారెడ్డి ఇటీవల కోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై విచారణ, మరోవైపు పోలీసుల దర్యాప్తు సమాంతరంగా కొనసాగుతున్న తరుణంలోనే అతడు పరారీ కావడం గమనార్హం. ప్రస్తుతం మొబైల్ స్విచ్ఛాఫ్ చేసి అజ్ఞాతంలో ఉన్న ఉదయ్ కృష్ణారెడ్డి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేడుకగా శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం


**ఇంద్రకీలాద్రి:** ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ ఆల యంలో శాకంబరీ ఉత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. అమ్మ వారి అలంకరణ కోసం దుర్గమ్మను ఇంటి ఆడపడుచుగా భావించి భక్తులు పండించిన మొదటి పంటను సమర్పించారని ఆలయ ఈవో పేర్కొన్నారు. అమ్మవారికి అలంకరించిన కాయగూరలతో కదంబ ప్రసాదం తయారు చేసి ఈ మూడు రోజులు భక్తులకు అందజే యనున్నారు. 32 టన్నుల కూరగాయలు : పాడిపంటలు వృద్ధి చెంది, సకాలంలో వర్షాలు కురవాలని, లోకం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ ఉత్సవాలను వరుసగా 19వ ఏటా నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, మార్కెట్‌లో కూరగాయల కొరత ఉన్నప్పటికీ దుర్గమ్మపై భక్తుల విశ్వాసం ముందు అవేవీ అడ్డంకి కాలేదు. దేవస్థానం ప్రత్యేక బృందాలు స్వయంగా రైతులు, వ్యాపారుల వద్దకు వెళ్లి



సేకరించిన విరాళాలతో ఏకంగా 32 టన్నుల కూరగాయలు, ఆకుకూరలను ఇంద్రకీలాద్రికి చేర్చారు. దీనికి తోడు విజయవాడ కేదారేశ్వంపేట హోల్‌సేల్ పండ్ల మార్కెట్ నుంచి మరో 4 టన్నుల పండ్లు అందించేందుకు వ్యాపారులు ముందుకు వచ్చారు. అమ్మవారి అలంకరణతో పాటు, ఆలయ ప్రాంగణాన్ని పచ్చదనంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుత ్నారు. ఇప్పటికే శాస్త్రోక్తంగా కాయగూరల దండలను సిద్ధం చేశారు. శాకంబరీ ఉత్సవాలు జరిగే మూడు రోజుల పాటు అమ్మవారి దర్శన వేళల్లో ఎలాంటి మార్పులూ ఉండవని, సాధారణ రోజుల్లాగే యథావిధిగా దర్శనాలు కొనసాగుతా యని ఆలయ ఈవో వి.కె.శీనా నాయక్ స్పష్టం చేశారు. బోనాలు సమర్పించిన తెలంగాణ మహిళలు : జులై 15 నుంచి ఆషాఢ మాసం ప్రారంభమైంది. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా జులై 27, 28, 29 తేదీల్లో దుర్గమ్మ దేవాల యంలో శాకంబరీ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఆషాఢ మాసం సందర్భంగా తెలంగాణ నుంచి బోనాలు సమర్పించడానికి ఇంద్రకీ లాద్రికి భారీగా భక్తులు తరలివస్తున్నారు. దీంతో జులై 26వ తేదీ నుంచి ఇంద్రకీలాద్రిపై ప్రోటోకాల్ దర్శనాలు నిలిపివేశారు. హైదరా బాద్ నుంచి బెజవాడ కనకదుర్గమ్మకు బంగారు బోనాన్ని సమర్పించారు. ఈ ఆనవాయితీ దాదాపు 17 ఏళ్లుగా కొనసాగుతోంది. భాగ్య నగర్ మహంకాళి బోనాల కమిటీ ఆధ్వర్యంలో బోనాన్ని సమర్పించారు. ఆషాఢ మాసంలో వచ్చే మొదటి ఆదివారం రోజు అమ్మవారికి ప్రతి ఏటా బోనాన్ని సమర్పిస్తారు. సుమారు 2000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలుచోట్ల శాకంబరీ అమ్మవారి ఉత్సవాలు : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరు గ్రామంలో జమ్మి చెట్టు కనకదుర్గమ్మ కు శాకంబరీగా వివిధ రకాల కూరలతో అలంకారం చేశారు. అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల కూరగాయలు పండ్లు డ్రై ఫ్రూట్స్ తో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామానికి చెందిన భక్తుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

# లిక్కర్ స్కాం కేసు.. చెవిరెడ్డి పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జులై 27:** సుప్రీంకోర్టులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చుక్క ఎదురైంది. ఏపీ లిక్కర్ స్కాంలో నిందితుడు దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. సోమవారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌లో పలు సందేహాలను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏమైనా సందేహాలుంటే సరైన సమయంలో తమ అభ్యంతరాలతో కోర్టును ఆశ్రయించవచ్చని ఆ వైసీపీ నేతకు ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే దొడ్డా వెంకట సత్యప్రసాద్‌ను అప్రూవర్‌గా మార్చి.. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారంటూ ఆ పిటిషన్‌లో వైసీపీ నేత చెవిరెడ్డి ఆరోపించారు.



దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు ఇచ్చిన ముందస్తు బెయిల్ కొట్టివేయాలంటూ సుప్రీంకోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేసిన విషయం విదితమే. ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, దొడ్డా వెంకట సత్యప్రసాద్‌లను అప్రూవర్‌లుగా మార్చి.. తద్వారా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ని ఇరికించేందుకు కూటమి ప్రభుత్వంతోపాటు ఈ కేసు విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) కుట్ర పన్నుతున్నాయని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపించిన సంగతి తెలిసిందే.

# ఏపీలో ‘మీ మార్ట్స్’.. ఎన్‌సీసీఎఫ్‌తో పౌరసరఫరాల శాఖ కీలక ఎంవోయూ

**అమరావతి, జులై 27:** ప్రజలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించేందుకు ఏపీ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వ నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌తో ఏపీ పౌర సరఫరాల శాఖ కీలక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుం ది. ఢిల్లీలో పౌర సరఫరాల కమిషనర్ కన్నబాబు ఐఏఎస్, ఎన్‌సీసీఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అనీస్ జోసెఫ్ ఒప్పందంపై



సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,000 ‘మీ మార్ట్స్’ ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఈ సేవలను ప్రారంభించనున్నారు. రేషన్ దుకాణాల ద్వారానే ‘మీ మార్ట్స్’ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మార్ట్స్‌లో 70 రకాల నాణ్యమైన వినియోగ వస్తువులు పోటీ ధరలకు విక్రయించనున్నారు. ప్రజలకు నాణ్యమైన వస్తువులను సరసమైన ధరల్లో అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,000 ‘మీ మార్ట్స్’ ఏర్పాటు ద్వారా వినియోగదారులకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

# మాతృభాషతోనే సృజనాత్మకత - ఏటా రాష్ట్రవ్యాప్తంగా తెలుగు మహోత్సవాలు:

**అమరావతి, జులై 27:** తెలుగు భాషా, సాంస్కృతిక వైభవాన్ని నలు దిశలా చాటేలా ఇక నుంచి ఏటా రాష్ట్రవ్యాప్తంగా తెలుగు మహోత్సవాలు నిర్వహిస్తామని మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా ఉండవల్లి గుహల వద్ద రెండ్రోజుల పాటు ఘనంగా నిర్వహించిన తెలుగు మహోత్సవాల ముగింపు వేడుకలకు మంత్రి హాజరయ్యారు. తెలుగు భాషా పరిరక్షణ, సాంస్కృతిక వైభవ పునరుద్ధరణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. మాతృభాషలోనే ప్రాథమిక విద్య, విద్యార్థుల్లో సర్వతోముఖాభివృద్ధికి దోహదమని తెలిపారు. పత్రికారంగానికి వన్నె తెచ్చిన ‘ఈనాడు’ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు తెలుగు భాషా వికాసానికి విశేష కృషి చేశారని కొనియాడారు. తమిళుల



తరహాలో తెలుగు భాషా పరిణామక్రమంపై సమగ్ర డాక్యుమెంటేషన్ రూపొందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కూటమి ప్రభుత్వంలో తెలుగు భాష, సంస్కృతికి స్వర్ణయుగం అని గుర్తుచేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అధిగమిస్తూ ప్రాథమిక విద్యలో తెలుగు తప్పనిసరి చేశామన్నారు. తోలుబొమ్మలాట, హరికథ, పద్య నాటకం వంటి ప్రాచీన కళారూపాలను కాపాడుకుందమని పిలుపునిచ్చారు. “నేను శాసనమండలి సభ్యుడిగా ఉన్నప్పుడు తెలుగును ‘ప్రాచీన భాష’గా గుర్తించాలనే ప్రతిపాదన వచ్చిన సందర్భంలో, అప్పటి సభ్యులలో చాలా మంది విద్యావంతులు లేదా ఉపాధ్యాయ వృత్తి నేపథ్యం ఉన్నవారే అయినప్పటికీ ఒక సవాలు ఎదురైంది. తెలుగు ఒక ప్రాచీన భాష అని నిరూపించడానికి అవసరమైన మేము తగిన రికార్డులను సమర్పించలేక పోయాము. దీనికి భిన్నంగా, తమిళులు వారి వద్ద ఆధారాలు సిద్ధం చేశారు. ఆ భాష పరిణామక్రమం, దాని స్థాయి పెరుగుదలకు సంబంధించిన వివరమైన రికార్డులు వారి వద్ద ఉండటం వల్ల, వారికి త్వరగా ‘ప్రాచీన భాష’ గుర్తింపు లభించింది. మన భాషకు కూడా చివరికి ఆ గుర్తింపు లభించినప్పటికీ, మన భాషకు సంబంధించి కూడా అటువంటి ఆధారాలను సేకరించి భద్రపరచుకోవాల్సిన అవసరం ఇంకా ఉంది” – కందుల దుర్గేశ్, మంత్రి. త్వరలోనే నంది నాటకోత్సవాలు: నాటక రంగానికి పూర్వవైభవం తెచ్చేలా త్వరలోనే ‘నంది నాటకోత్సవాలు’ నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఆగస్టు 4న విజయవాడలో నిర్వహించే మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పురస్కరించుకుని ఘనంగా తెలుగు భాషా దినోత్సవం, తెలుగు భాషా పురస్కారాలు అందిస్తామన్నారు.

# నన్ను చంపాలని చాలాసార్లు ప్రయత్నించారు

**అమరావతి, జులై 27:** అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు తనను అడ్డు తొలగించుకునేందుకు వైఎస్సార్సీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్ కుటుంబం అనేకసార్లు యత్నించిందని కోడలు మేఘన ఆరోపించారు. స్వయంగా మామ జోగి రమేశ్? తలపై దిండు పెట్టి బలంగా నొక్కిపెట్టారని, భర్త రాజీవ్ మెడకు చున్నీ బిగించి చంపేందుకు ప్రయత్నించారని ఫిర్యాదులో వివరించారు. బలవంతంగా బంధించి, కనీసం భోజనం కూడా పెట్టలేదన్నారు. వేధింపుల గురించి కన్న తల్లిదండ్రులకు చెబితే శవమే కనిపించేలా చేస్తామని బెదిరింపులకూ దిగారని ఫిర్యాదులో వాపోయారు. వైఎస్సార్సీపీ నేత, మాజీమంత్రి జోగి రమేశ్ కుటుంబంపై పెట్టిన కేసులో కోడలు మేఘన సంచలన ఆరోపణలు చేశారు.



2025 మే 28న సూర్యాపేటలో తమ వివాహం జరిగిన తర్వాత భర్త జోగి రాజీవ్ ఏ రోజూ తనను సరిగ్గా చూసుకోలేదన్నారు. శారీరకంగా, మానసికంగా వేధించారని, అత్తమామలు అతనికే వత్తాసు పలికారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో జోగి రమేశ్ కోడలు మేఘన ఆరోపించారు. పెళ్లి సమయంలో ఇచ్చినవి చాల్లేదంటూ మరో రూ.5 కోట్లు కట్నం, ఫార్చ్యునర్ కారు, అత్త, ఆడపడుచులకు వజ్రాల హారాలు చేయించి తీసుకురావాలని వేధించారని వాపోయారు. మెడకు చున్నీ బిగించి : తన ఆస్తులను రాజీవ్ పేరిట బదిలీ చేయాలని ఒత్తిడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరోజు ఇంటి టెర్రస్ పైనుంచి మామ జోగి రమేశ్?, ఆయన సోదరుడు రాము, స్వామి అనే మరో వ్యక్తి కలిసి తనను తోసేయడానికి ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోరోజు అంతా కలిసి తన మెడకు చున్నీ బిగించి, ముఖంపై తలగడ పెట్టి చంపాలని ప్రయత్నించారని తెలిపారు. ఈ విషయం తల్లిదండ్రులకు చెబితే వారికి తన శవమే కనిపించేలా చేస్తామని బెదిరించారంటూ నిర్ఘాంతపోయే విషయాలు వెల్లడించారు. పెళ్లిసమయం నుంచే అత్తింటివారి వేధింపులు ఆరంభమయాయ్యాని మేఘన తన ఫిర్యాదులో తెలిపారు. పెళ్లికి వచ్చిన అతిథులకు తిరుగు కానుకలుగా వెండి వస్తువులు ఇవ్వాలన్నారని వెల్లడించారు. తన తల్లిదండ్రులు రూ.5 కోట్లతో పెళ్లి చేశారని, 1.5 కిలోల బంగారం, 10 కిలోల వెండి, ఆడపడుచుకు రూ.9 లక్షల కట్నంతో పాటు అనేక కానుకలు ఇచ్చినట్లు వివరించారు. అయినా చాల్లేదని, అప్పట్నుంచి వేధిస్తూనే ఉన్నారన్నారు. ఆ విషయం దాచిపెట్టారు : తన భర్తకు శారీరక సమస్య ఉందని తెలిసిందని, అది దాచిపెట్టి మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# కృష్ణా జలాల్లో వాటాపై సుప్రీంకోర్టులో విచారణ.. కర్ణాటక విజ్ఞప్తిని తిరస్కరించిన ధర్మాసనం

**న్యూఢిల్లీ, జులై 27:** కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై(సోమవారం) సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున.. ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు



విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.